సమ్మెపై కదలిక



మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం ఇస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు

చీమకుర్తి ప్రాంత గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమ్మెపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఫ్యాక్టరీల యజమానుల ఆవేదనను సానుకూలంగా అర్థం చేసుకొని వారికి వెసులుబాటు కలిగేలా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ పెద్దలు కదిలారు. ఇందుకు సంబంధించి శనివారం పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు ఈ అంశంపై ఫోన్‌లో మాట్లాడుకున్నారు. సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయానికి వచ్చారు. మంత్రి స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు సమావేశమై స్థానికంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

- గ్రానైట్ సమస్య తీవ్రతపై చర్చించుకున్న మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ స్వామి
- వారిద్దరినీ కలిసి ఆవేదన వెలిబుచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు
- మరోవైపు స్వామి, జనార్దన్, కలెక్టర్ భేటీ
- స్థానికంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ
- సానుకూల పరిష్కారం వైపు అందరి దృష్టి

ఒంగోలు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న అనిశ్చితిపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఆ మేరకు ఇద్దరు మంత్రులు ఈ విషయంపై దృష్టి పెట్టి చర్చలు జరిపారు. అలాగే స్థానికంగానూ ప్రభుత్వ పెద్దలు సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మైనింగ్ రాయల్టీ వసూళ్లను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో గ్రానైట్ పరిశ్రమలో కలకలం రేగింది. అలాగే ఇక్కడ కాంట్రాక్టు పొందిన ఏఎంఆర్ సంస్థ పోకడపై చీమకుర్తి ప్రాంత ఫ్యాక్టరీల యజమానులు తీవ్ర అభ్యంతరం, ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుత విధానంతో ఫ్యాక్టరీల భవిష్యత్ ఆందోళనకరమని, పరిశ్రమల మనుగడే కష్టమని వారు భావిస్తున్నారు. ప్రధానంగా ప్రస్తుతం కట్టర్‌కు రూ.35వేలు రాయల్టీగా ప్రభుత్వానికి చెల్లిస్తుండగా దానితోపాటు అదనంగా మరో రూ.30వేల నుంచి 35వేలు ఆ సంస్థ కోరుతున్నదని చెప్తున్నారు. అలా అయితే తాము తీవ్రంగా నష్టపోతామని, పరిశ్రమలు

మిగతా 6వ పేజీలో

సార్లొస్తున్నారు!

- రేపటి నుంచి విధుల్లోకి కొత్త టీచర్లు
- ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న కొరత
- ఉమ్మడి జిల్లాలో 657 మంది నియామకం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి శిక్షణ తరగతులు ముగిశాయి. జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న ఖాళీల్లో వారిని నియమించారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్, గిరిజన పాఠశాలల్లో 673 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 657 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అభ్యర్థులు ఎంపికైనప్పటికీ వివిధ కారణాలతో నిరాకరించారు. మరో 11 ఉపాధ్యాయ పోస్టులకు అర్హత ఉన్న వారు లేక భర్తీ చేయలేదు. ప్రస్తుతం 657



ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను కేటగిరీ-3 పాఠశాలల్లో నియమించినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ అధికారులు పూర్తిచేసినట్లు తెలిసింది. డీఎస్సీలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 3 నుంచి 9వతేదీ వరకు శిక్షణ ఇచ్చారు. వారికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించారు. వెంటనే పాఠశాలల్లో చేరేందుకు కొత్త వారు సిద్ధమయ్యారు. దీంతో ఆయా స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ఇప్పటికే కేటగిరీ-3లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వాటిల్లో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త వారిని నియమించారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నాయి.



పొగాకు కాలిపోయిన గోదాము నుంచి వస్తున్న పొగలు

సెగ.. పొగ!

- పొగాకు కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగిన బ్లాక్‌లలో రెండోరోజు పరిస్థితి ఇదీ..
- వివరాలు సేకరించలేకపోయిన ఎఫ్ఎస్ఎల్ బృందం, విద్యుత్ అధికారులు
- పరిశీలించిన మంత్రి డాక్టర్ స్వామి

సింగరాయకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో ఉన్న బీకేటీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన రెండు బ్లాకుల నుంచి ఇంకా సెగ, పొగ వస్తోంది. ఘటన శుక్రవారం వేకువ జామున చోటుచేసుకున్నప్పటికీ శనివారం సాయంత్రం వరకూ కూడా గోదాములో ఇంకా పొగాకు లోలోన కాలుతూనే ఉంది. ఇది విచారణకు అవరోధంగా మారింది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు వచ్చిన ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం, విద్యుత్ అధికారులు గోదాం వద్ద ప్రతికూల పరిస్థితితో వివరాలు సేకరించలేక పోయినట్లు తెలుస్తోంది. మంటలు, పొగ పూర్తిగా అదుపులోకి వస్తేనే ప్రమాదానికి గల కారణాలను గుర్తించగలమని వారు తెలిపినట్లు సమాచారం. అగ్నిప్రమాదం జరిగిన కంపెనీని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్నిప్రమాదంలో

మిగతా 6వ పేజీలో



కమనీయం.. చెన్నయ్య కల్యాణం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం కన్నులపండువలా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు మధ్యరంగ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పరిణయ ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి తరించారు. కొందరు స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.

- ఆంధ్రజ్యోతి, మార్కాపురం వన్‌టౌన్

రేపు ఒంగోలులోనే 'మీ కోసం'

మార్కాపురంలో నిర్వహణ వాయిదా

నీటి కుంటలో పడి బాలుడు మృతి

వివరాలు 7వ పేజీలో

ఉత్సాహంగా...

జిల్లావ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఒంగోలులో పాల్గొన్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు
- ఇతర ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, పలువురు ముఖ్య నేతలు హాజరు
- మహిళల పేరుతో కార్డులు
- సచివాలయాల్లో మార్పులకు అవకాశం



ఒంగోలులో స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తున్న మంత్రి స్వామి, వేదికపై ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు, ఒడా ఛైర్మన్ రియాజ్ తదితరులు



స్మార్ట్ రేషన్ కార్డులను చూపుతున్న మహిళలు

ఒంగోలు అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఇందుకోసం ప్రత్యేక సభలు, సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో ఏటీఎం కార్డుల సైజులో స్మార్ట్ కార్డులను ప్రభుత్వం తెచ్చింది. దీనిపై ఉండే క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ లేదా స్వైప్ చేయడం ద్వారా రేషన్ తీసుకునే విధంగా రూపొందించింది. ఆ కార్డులోనే కుటుంబ సభ్యుల వివరాలు, ఏనెలలో ఏ దుకాణం నుంచి సరుకులు తీసుకున్నారు వంటి వివరాలన్నీ ఉండనున్నాయి. ఇప్పటి వరకు రేషన్ కార్డు చూపి దుకాణం వద్ద కార్డుదారు వేలిముద్ర వేసి సరుకులు తీసుకునే వారు. దాని వల్ల చాలా మంది వేలిముద్రలు పడక ఇబ్బంది కలుగుతోంది. తాజాగా తెచ్చిన స్మార్ట్ కార్డుతో ఈ సమస్యలు తొలగిపోనున్నాయి. జిల్లాలో 1,392 రేషన్‌షాపులు ఉండగా వాటి పరిధిలో 6.61లక్షల కార్డులు ఉన్నాయి. అందరికీ ప్రస్తుత కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు, అవి కూడా మహిళల పేరుతో ఇవ్వడం ప్రత్యేకత. కుటుంబ యజమానికి పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను కూడా వారి పేరుతోనే ఇస్తోంది. అంతేకాక కార్డులలో మార్పులు, చేర్పులను అధికారుల అనుమతితో సచివాలయ స్థాయిలోనే చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రకాశం భవనంలో అధికారిక కార్యక్రమం

ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్డుల పంపిణీని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్మార్ట్‌కార్డుల

మిగతా 6వ పేజీలో

ప్రత్యామ్నాయం వైపు మిర్చి రైతు చూపు

మార్కాపురం డివిజన్‌లో తగ్గిన విస్తీర్ణం

పెరిగిన బొప్పాయి, మొక్కజొన్న సాగు



తర్లుపాడు మండలం కారుమానిపల్లె వద్ద మిర్చి వేసే పొలంలో సాగు చేసిన బొప్పాయి

మార్కాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటల్లో రారాజు మిర్చి. అన్నీ అనుకూలిస్తే రైతులకు సిరుల పంటే. ఎన్ని ప్రతికూలతలు ఉన్నా ధరలు బాగుంటే రైతులకు రూ.లక్షల్లో ఆదాయం తీసుకువచ్చేది ఈ పంటే. పశ్చిమ ప్రకాశంలో గతంలో మిర్చి సాగు చేసిన రైతులు బాగానే లాభాలు ఆర్జించారు. అయితే రెండేళ్లుగా మిరప నష్టాల ఘాటు చూపిస్తోంది. ఒకవైపు తెగుళ్లు, మరోవైపు దిగుబడులు తగ్గడం, ఇంకోవైపు గిట్టుబాటు ధర లేకపోవడం, యాజమాన్య ఖర్చులు పెరగడం, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగ్గా లేకపోవడం తదితరాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీంతో ప్రస్తుతం మిర్చి సాగు చేయాలంటేనే భయపడుతున్నారు. రెండేళ్లుగా క్రమేపీ సాగు విస్తీర్ణం తగ్గుతోంది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మరలుతున్నారు. ఏదో కొద్దిపాటి విస్తీర్ణంలో మాత్రమే మార్కాపురం డివిజన్‌లో సాగవుతోంది.

ఏటికేడు తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో వాణిజ్య పంటల్లో పొగాకు, మిర్చి ప్రధానమైనవి. పొగాకు ఎక్కువగా రబీ సీజన్‌లో సాగవుతుంది. మిర్చి ఖరీఫ్ చివర నుంచి ప్రారంభమై రబీ మధ్య వరకు నాటుతారు. వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్‌లో కూడా అధిక మొత్తంలో సాగవుతుంది. జిల్లాలో మిర్చి సాధారణ విస్తీర్ణం 75వేల ఎకరాల వరకు ఉంటుంది. అందులో 50వేల ఎకరాల వరకు మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల్లోనే సాగు చేస్తారు. రెండేళ్ల క్రితం జిల్లాలో సాధారణ విస్తీర్ణానికి మించి మరో 20వేలు ఎకరాలు సాగైంది. దీంతో 95వేల ఎకరాలకు చేరింది. గతేడాది సుమారు 40వేల ఎకరాల మేర తగ్గి 55వేల ఎకరాలకే పరిమితమైంది. అందులో మార్కాపురం డివిజన్‌లోనే 41,871 ఎకరాల్లో

మిగతా 6వ పేజీలో

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

- రైళ్లలో ఈగల్ టీం తనిఖీలు
- బస్టాండ్‌లు, లాడ్జీలపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- రంగంలోకి రాక్సీ డాగ్

7





కీళ్లవాతం.. కదలడం కష్టం!

- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందే
- వ్యాయామంతోనే సమస్యకు చెక్
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

7



రిమ్స్‌లోని సెంట్రలైజ్డ్ ఐసీయూ

ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం

- జీజీహెచ్‌లో సెంట్రలైజ్డ్ ఐసీయూ
- ప్రారంభించిన ఎమ్మెల్యే జనార్దన్

7

చెరువులకు జలకళ

- సాగర్ జలాలతో నిండిన వైనం
- మూగ జీవాలకు తీరనున్న దాహార్తి
- పెరగనున్న భూగర్భ జలం

7



సాగర్ జలాలతో నిండిన నూజెండ్లపల్లి చెరువు



శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షాధారులు (ఫొటో)

శింగరకొండలో హనుమాన్ దీక్షకు ఏర్పాట్లు

- దశాబ్ద కాలం క్రితం ప్రారంభం
- ఏటికేడు పెరుగుతున్న భక్తులు
- 23న మండల, నవంబరు 12న అర్ధమండల దీక్షలు

అద్దంకి,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి):శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమద్ర్వతం సందర్భంగా డిసెంబర్ 3న హనుమాన్ దీక్షల విరమణ, ఇరుముడుల సమర్పణ ఉంటుందని ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. ఈ నెల 23న మండల దీక్ష చేపట్టే భక్తులు మాలాధారణ, నవంబరు 12న అర్ధ మండల దీక్ష భక్తులు మాలాధారణ చేసి దీక్షలు చేపట్టనున్నారు. దీక్షలు పూర్తయిన తరువాత డిసెంబరు 3 న హనుమ ద్ర్వతం సందర్భంగా మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి నిర్వహించి దీక్షా విరమణ చేయనున్నారు. 10 సంవత్సరాల క్రితం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి వచ్చే భక్తులు హనుమాన్ దీక్షలు తీసుకోవడం ప్రారంభించారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలలోని పలు గ్రామాల నుంచి భక్తులు హనుమాన్ దీక్షలు తీసుకొని స్వామివారికి ఇరుముడులు సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఇరుముడులతో వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ముందు రోజు రాత్రి నుండి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దీక్షా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. దీక్ష తీసుకొనే భక్తుల సంఖ్య ఏటికేడు పెరుగుతోందని ఈవో తిమ్మనాయుడు తెలిపారు. వందల సంఖ్యలో భక్తులు ఇరుముడులతో వచ్చి స్వామి వారికి సమర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా మండల దీక్ష, అర్ధ మండల దీక్ష లు తీసుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



ఢిల్లీ ముఠా సభ్యులను ప్రశ్నిస్తున్న పోలీసులు

విదేశీ టూర్ పేరుతో ఢిల్లీ ముఠా టోకరా

- పోలీసుల అదుపులో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు
- పరారీలో మరో ముగ్గురు..
- నెల్లూరులో ఓ బాధితుడి ఫిర్యాదు
- అక్కడి పోలీసుల సమాచారంతో హోటల్‌పై దాడి

ఒంగోలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విదేశీ టూర్ పేరుతో ఢిల్లీ ముఠా రాష్ట్రంలో మోసాలకు పాల్పడుతూ ఒంగోలు పోలీసులకు పట్టుబడ్డారు. శనివారం ఒంగోలు నగరంలోని మౌర్య ఇన్‌లో బస చేసిన వారిని పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి సమీపంలోని నోయిడాకు చెందిన పది మంది ముఠా మకాం వేసి నగరంలోని వ్యాపార ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలకు వల వేసి ఫోన్‌ల ద్వారా పిలిపించుకుని వారం రోజులు దుబాయి టూర్ కోసం రూ. 2.25 లక్షల ప్యాకేజీ పేరుతో వసూళ్ళు ప్రారంభించారు. విహారయాత్రకు వెళ్లేందుకు కొంతమంది డాక్టర్లు, వ్యాపారవేత్తలు అడ్వాన్సు పేరుతో లక్షల రూపాయలు చెల్లించారు. అయితే పదిహేను రోజుల క్రితం నెల్లూరులో ఇదే ముఠా అనేకమందిని మోసం చేసి భారీగా డబ్బులు వసూలు చేశారు. దీంతో ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నెల్లూరు పోలీసుల దర్యాప్తులో భాగంగా ఈ ముఠా సెల్‌ఫోన్‌ల టవర్ ఆధారంగా ఒంగోలు చేరుకున్నట్లు గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావుకు విషయాన్ని తెలియజేయడంతో అప్రమత్తమై మౌర్య ఇన్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. తాలూకా సీఐ విజయ్‌కృష్ణ, పోలీసు సిబ్బంది ఆకస్మింగా తనిఖీలు చేసి ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు మొత్తం ఏడుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. అయితే ముఠాకు మోసపోయిన బాధితుడైన ఓ డాక్టర్ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 17వతేదీన జిల్లా స్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి పి. శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూపు విభాగంలో ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, ప్రసంగం, పద్యరచన, కథారచన, చిత్రలేఖనం, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు నిర్వహిస్తామన్నారు. జిల్లా యువజనోత్సవాల్లో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 12న జరిగే జాతీయయువజనోత్సవల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఖర్చుతో పంపుతామన్నారు. జిల్లాలోని 15నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ఈనెల 15వతేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9573464848, 9182891095 నెంబర్లను సంప్రదించాలని శ్రీమన్నారాయణ కోరారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మార్కాపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ ఎస్‌ఐ అంకమ్మరావు శనివారం తెల్లవారుజామున మండలంలోని తిప్పాయపాలెం వద్ద పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దదోర్నాల నుంచి నంద్యాలకు అక్రమంగా 60 బస్తాలలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీకి చెందిన బాషా, నారాయణరెడ్డి, ఫణిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వెంకట్రావు కుటుంబానికి మంత్రి పరామర్శ

సంతమాగులూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) టీడీపీ మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకట్రావు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శనివారం అడవిపాలెం గ్రామంలోని ఆయన నివాసానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకట్రావు కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు,

వృద్ధులకు నిత్యావసరాలు అందజేత

దేశాయిపేట(చీరాల), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వయోభారంలో వృద్ధులను గౌరవించాలని, వారిపట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు బండారుపల్లి హేమంత్‌కుమార్, నాగవీరభద్రాచారి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు

- రామాపురం తీరాన్ని పరిశీలించిన కలెక్టర్
- అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులకు పలు సూచనలు



సముద్రతీరం మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగం అభివృద్ధికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డా.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. రూ.2.35 కోట్ల నిధులతో జరుగుతున్న బీచ్ అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి సైతం నిత్యం తీరానికి విచ్చేస్తున్న క్రమంలో వారికి వసతుల్లో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈక్రమంలోనే రూ.40 లక్షలతో తాగునీటి పైప్‌లైన్స్, రూ.30 లక్షలతో డ్రెస్సింగ్ రూంలు, రూ.10 లక్షలతో ఓపెన్ షవర్ పాయింట్స్, రూ.30 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సు, రూ.95 లక్షలతో బయో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులకు సంబంధించి స్థితిగతులను ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పర్యాటక శాఖ అధికా రి నాగిరెడ్డి, సీటిసరఫరా అధికారి అనంత రాజు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్‌లు గోపీకృష్ణ, గీతారాణి, ఎంపీడీవో విజయ, ఏఈ నాగరాజు సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ఆవుల డొంక

- డొంకకు రెండు వైపులా మాగాణి సాగు
- కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్న రైతులు
- ఎగువ ప్రాంత రైతుల్లో ఆందోళన

బల్లికురవ, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో పురాతన కాలం నుండి రైతులకు ఎంతో ఉపయెగపడే ఆవుల డొంకను కొందరు రైతులు పంటలు సాగు చేస్తూ ఆక్రమించుకుంటున్నారు. దీంతో డొంకకు ఎగువ భాగంలో పంట భూములు ఉన్న రైతులు ఈ డొంకలో గుండా రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో కొండ దిగువన ఉన్న ఆవుల డొంకకు ఇరు వైపులా సుమారు వంద ఎకరాలకు పైబడి పంట భూమి ఉంది. ఈ డొంకను కొందరు రైతులు రెండు వైపులా రోజు రోజుకు నరుకుతున్నారు. పంట భూముల్లో వ్యర్థాలను సైతం రోడ్డునే పడేస్తున్నారు. దీంతో నిత్యం పంట పోలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటివల ఈడొంకను గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పరిచారు. అయినప్పటికి డొంక భూమిని రైతులు ఆక్రమించుకుంటున్నారు. దిగువ భూములు ఉన్న రైతులకు ఇబ్బంది లేకపోయిన సుమారు 50 ఎకరాల పంటలు సాగు చేసే రైతులు మాత్రం ఆవుల డొంక సరిగా లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబందిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆవుల డొంకను సర్వే చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మాగాణి సాగుతో కుంచించుకుపోతున్న ఆవుల డొంక



ఎగువన ఉన్న రైతులకు ఇబ్బంది కలిగేలా డొంకపై వేసిన వ్యర్థాలు

పీఎం ధనధాన్య కృషియోజనతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు



మాట్లాడుతున్న డీఏవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

పంగులూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న పీఎం దనధాన్య కృషియోజన ద్వారా రైతు సంక్షేమానికి, ఆహారభద్రతకు భరోసా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రహ్మణేశ్వరరావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో పలు వ్యవసాయాభివృద్ధి పథకాలపై పథకాలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అద్దంకి, మార్టూరు, పర్చూరు ఏడీఏల పరిధిలోని పది మండలాల ఏవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతుల ఆదాయం పెరగడానికి, పంట ల వైవిధ్యం సాధించడానికి, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ధనధాన్య కృషియోజనలో జాతీయ ప్రకృతి వ్యవసాయమిషన్, జాతీయ ఆహార వంటనూనెలు, నూనె గింజల మిషన్‌లు ఈ పథకంలో ఉన్నాయన్నారు. ఆత్మనిర్బర్ మిషన్ కాలపరిమితి 2025-26 నుండి 2030-31వరకు అమలులో ఉంటుంద న్నారు. ఈ పథకం అధిక దగుబడులు సాధించడం పంటలను నిల్వచేయడం పర్యావరణాన్ని రక్షించడం వంటి లక్ష్యాల కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు ఏడీఏలు సుదర్శనరాజు, ప్రవీణ, టెక్నికల్ ఏవో వెంకటరామయ్య, అద్దంకి, మార్టూరు, కొరిశపాడు, పంగులూరు, పర్చూరు, ఇంకొల్లు, బల్లికురవ, యద్దనపూడి, ఏవోలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు కె.వి.సుబ్బారావు, మురకొండ సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీదర్, పెంట్యాల రామలింగ స్వామి, ఎంపీటీసీ సభ్యులు వాసవి, పీఏసీఎస్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

నిచ్చెనలు, వెదురు కర్రలతో సరి



ప్రధాన విద్యుత్ తీగలకు ఆసరాగా ఏర్పాటు చేసిన నిచ్చెన

పర్చూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు ఏళ్ల నాటి విద్యుత్ తీగలు కిందకు జారీ ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఏదో ఒక చోట విద్యుత్ తీగలు తెగి కిందపడుతున్నాయి. అదృష్టవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడిన చోట ప్రజలు లేకపోవటంతో పెనుప్రమాదం తప్పుతోంది. ఇలాంటి పరిస్థి తులు మండల కేంద్రమైన పర్చూరులో తరుచూ చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇటీవల పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ తీగ తెగి బస్సుమీద పడింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. పర్చూరు - ఇంకొల్లు రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో విద్యుత్ తీగ కిందకు జారింది. ఎదురు వెదురుతో తయారుచేసిన నిచ్చెను పెట్టి సరిపెట్టారు. అయితే పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టలేదు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే రహదారిలో ఇలాంటి ఏర్పాట్లు చేయ డంతో ఇదిచూసిన ప్రజలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను తొలగించి, పూర్తిస్థాయిలో కొత్త విద్యుత్ వైర్లతోపాటు, నాణ్యమైన స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని సప్లై చానల్

- రెండు చోట్ల గండ్లు పడినా పట్టించుకోని అధికారులు
- వృథాగా పోతున్న వరద నీరు
- తాగు, సాగుకు ఇబ్బందులు

పుల్లలచెరువు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూగర్భ జలాలను పెంచి తాగు, సాగు నీటి సమస్యలు లేకుండా ఉండేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా చెరువులకు, కుంటలకు నీరు వచ్చే ప్రధానమైన సప్లై చానల్‌ను మాత్రం పట్టించు కోవడం లేదు. ఆరేళ్లుగా మరమ్మతులకు నోచుకోక సప్లై చానల్ నుంచి వరద నీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లలచెరువు మండలంలోని కొమరోలు - కొత్తపల్లి, చాపలమడుగు, చెన్నంపల్లి, త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం, త్రిపురాంతకం సప్లై చానల్‌కు గ్రహణం పట్టింది. సప్లై చానల్ ద్వారా యండ్రపల్లి, మల్లాపాలెం, కొమరోలు, కొత్తపల్లి గ్రామాల్లోని అటవీ ప్రాం తాల్లో కురిసిన వర్షాలకు దువ్వలేరుకు పెద్ద ఎత్తున వరద నీరు చేరుతోంది. కొత్తపల్లి సమీపంలోని దువ్వలేరు కాలువ నుంచి సప్లై చానల్‌కు నీరు వస్తోంది. దీంతో పుల్లలచెరువు మండలంలోని కొత్తకుంట చెరువు, త్రిపురాంతకం మండలంలోని త్రిపురాతకం చెరువు, రామసముద్రం చెరువులకు నీరు చేరుతోంది. ఇటీవల కురిసిన వ ర్షాలకు ఈ చానల్ ద్వారా నీరు వచ్చినా చాపలమడుగు వద్ద కాలువ గట్టు ఎత్తు పెంచకపోవడం, చిల్లకంప పెరగి ప్రవాహానికి అడ్డుపడడంతో వరద నీరు వృథాగా పోతుంది. చాపలమడుగుకు సమీపంలో ఉన్న పాత బ్రిడ్జి వద్ద పెద్ద రంధ్రం పడి కూడా నీరు వృథాగా పోతోంది. ఇటీవల కాలువకు ఇరువైపులా గండ్లు పడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెప్తున్నారు. సప్లై చానల్ సక్రమంగా పని చేస్తే రెండు మండలాల్లోని సూమారు 10 గ్రామాలకు సాగు, తాగు నీరు అందుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సప్లై చానల్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



చాపలమడుగు వద్ద సప్లై చానల్ నుంచి వృథాగా పోతున్న నీరు

ప్రత్యామ్నాయం వైపు మిర్చి రైతు చూపు

(5వ పేజీ తరువాయి)

సాగు చేశారు. ఎన్నడూలేని విధంగా అధిక వర్షాలు, విపరీతమైన తెగుళ్ల, కనీస గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో రూ.లక్షల్లో రైతులు నష్టపోయారు. దీంతో ఇప్పుడు మిర్చి అంటేనే వెనకడుగు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరకు డివిజన్‌లో 8వేల ఎకరాల్లో మాత్రమే మిర్చి నాట్లు వేశారు. రబీలో మరో 10 నుంచి 15వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెప్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే మార్కాపురం డివిజన్‌లో సాగు విస్తీర్ణం 50 శాతానికి పైగా తగ్గినట్లే.

మొక్కజొన్న, బొప్పాయి వైపు మొగ్గు

మిరప సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులు ఈ సంవత్సరం ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న, బొప్పాయి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా బొప్పాయి సాగు పెరిగింది. ఎక్కువగా మొక్కలు లభించేది ఎర్రగొండపాలెంలోనే. అయితే డిమాండ్ ఎక్కువగా ఉండడంతో మహారాష్ట్ర, అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బొప్పాయి మొక్కలను దళారులు తెచ్చి రైతులకు అమ్మారు. అదేవిధంగా మొక్కజొన్న కూడా ఎక్కువగా సాగైంది. ప్రస్తుతం కంపెనీలకు చెందిన ప్రతినిధులు సీడ్ కోసం రైతులకు పెట్టుబడి ఇచ్చి మరీ సాగు చేయించారు. ఖరీఫ్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా విత్తన మొక్కజొన్న ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. రబీలో డిసెంబర్‌లో కూడా మళ్లీ రైతులు మొక్కజొన్న వేసే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక బాగా నష్టపోయిన కొందరు మిర్చి రైతులు మెట్ట పంటలైన కంది, మినుము, సజ్జ, నువ్వులు, జూట్, ఆముదం సాగు చేశారు. యాజమాన్య ఖర్చులు తక్కువగా ఉండడంతో ఆ వైపు రైతులు మరలారు.



సగానికిపైగానే సాగు తగ్గించాం

- వెన్నా వెంకటరెడ్డి, బొడిచెర్ల, మార్కాపురం మండలం

గతంతో పోల్చితే సగానికి పైగానే మిర్చి సాగు తగ్గించాం. ఒకప్పుడు 5 నుంచి 10 ఎకరాలు సాగు చేసే రైతులు ప్రస్తుతం రెండు నుంచి మూడు ఎకరాలకు మించి వేయడం లేదు. గత సంవత్సరం బాగా నష్టాలు వచ్చాయి. నేను మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేసి రూ.2లక్షల మేర నష్టపోయాను. ప్రస్తుతం మెట్ట పంట కంది సాగు చేశాను.



తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయాం

- కంది చిన్ననారాయణరెడ్డి, కారుమానుపల్లి, తర్లుపాడు మండలం

నేను గత సంవత్సరం 8 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ఎన్నడూలేని విధంగా తెగుళ్ల చుట్టుముట్టాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా లాభం లేకపోయింది. దిగుబడి పూర్తిగా తగ్గింది. కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. పండిన కొద్దిపాటి పంటను తక్కువ ధరకు అమ్మలేక గుంటూరు మిర్చి యార్డులో ఏసీలో పెట్టాను. ఈ సంవత్సరం రెండు ఎకరాలు మాత్రమే మిర్చి వేశా. 4 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశా.

సమ్మెపై కదలిక

(5వ పేజీ తరువాయి)

మూసివేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రానైట్ క్వారీల్లో జరిగే చిన్నచిన్న లోపాలను హేతుబద్ధంగా పరిశీలించకుండా వాటిని ఆసరా చేసుకొని తమపై భారం మోపుతున్నారన్న ఆందోళనతో చీమకుర్తి ప్రాంతంలోని 800 ఫ్యాక్టరీల యాజమనులు ఈనెల 1 నుంచి సమ్మెబాట పట్టారు.

ఉపాధిపై దెబ్బ.. అంతా వెలవెల

సమ్మెతో ఫ్యాక్టరీలలో పనులు నిలిచిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మంది ఉపాధిపై దెబ్బపడింది. వలస కూలీల్లో ఎక్కువ మంది సొంత రాష్ట్రానికి వెలపోయారు. వెళ్లిపోయారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే చీమకుర్తి ప్రాంతంలోని రామతీర్థం, మర్రిచెట్లపాలెం సెంటర్లు వెలవెలబోతున్నాయి. పదిరోజులుగా పెద్దగా ప్రభుత్వ పరంగా స్పందన కనిపించకపోగా శనివారం పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఉదయం జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామిని తూర్పునాయుడుపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారికంగా ప్రభుత్వం వసూలు చేసే రూ.31వేల రాయల్టీకి అదనంగా మరో రూ.35వేలు వసూలుకు సిద్ధపడటం దారుణమన్నారు. ప్రస్తుతం తమకు ఇస్తున్న 22 మీటర్ల అనుమతికి బదులు 35 మీటర్లు ఇవ్వాలని కోరారు. వాటితోపాటు మరికొన్ని విషయాలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రి కొల్లుతో ఫోన్‌లో మాట్లాడిన స్వామి

మంత్రి స్వామి ఈ విషయమై రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రకు ఫోన్ చేసి మాట్లాడారు. సమస్య తీవ్రత, కీలకమైన గ్రానైట్ పరిశ్రమ మూత, దీంతో నెలకొన్న పరిణామాలపై వారిద్దరు చర్చించుకొని సానుకూల పరిష్కారం చూపాలన్న నిర్ణయానికి వచ్చారు. మంత్రి స్వామి సూచనల మేరకు ఫ్యాక్టరీల యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మధ్యాహ్నం విజయవాడ వెళ్లి గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి తమ ఆవేదనను వివరించారు. అసోసియేషన్ ప్రతినిధులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, కన్నూరి సుబ్బారావు తదితరులు మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు. ఉన్నతాధికారులు, ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి రవీంద్ర అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

కలెక్టర్ చాంబర్‌లో సమావేశం

ఇదే విషయమై శనివారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబులు భేటీ అయి చర్చించారు. ప్రకాశం భవనంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వారు.. ముందుగా అరగంటపాటు కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమ సమ్మె, ఇతర మైనింగ్ అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.. ఫ్యాక్టరీ యజమానుల ఆవేదనను అర్థం చేసుకొని పరిశ్రమకు ఇబ్బంది కలుగకుండా స్థానికంగా చర్యలు తీసుకోవాల్సి ఉందని, ఆ వైపు దృష్టిపెట్టాలని మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్‌లు ఆ సందర్భంగా కలెక్టర్ రాజాబాబుకు సూచించారు. ఇసుక విషయంలో కొందరు గనుల అధికారుల తీరును ఎమ్మెల్యే తప్పుబడుతూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం.

సెగ.. పొగ!

(5వ పేజీ తరువాయి)

సుమారు రూ.550 కోట్ల నష్టం వాటిల్లినట్లు బీకేటీ కంపెనీని అద్దె ప్రతిపాదికన తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న జీపీఐ ప్రతినిధులు తెలిపారని వెల్లడించారు. అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపుచేశారన్నారు. మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు తనతో ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు. వారికి ప్రమాదం జరిగిన తీరును వివరించానన్నారు. విచారణ అనంతరం కంపెనీ నష్టపోకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట టంగుటూరి మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, జీపీఐ కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

ఉత్సాహంగా..

(5వ పేజీ తరువాయి)

పంపిణీని ప్రారంభించారు. రాచర్ల మండలం అనుమలవీడులో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, కురిచేడులోని 15వ నంబర్ రేషన్ దుకాణం వద్ద టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు.

గుంతలో ఇరుక్కున్న ఆర్‌టీసీ బస్సు

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ బస్సు రోడ్డు మధ్యలో గోతిలో ఇరుక్కుపోయిన ఘటన యద్దనపూడి మండలంలో మార్టూరు-యద్దనపూడి మధ్య యనమదల గ్రామంలో చోటు చేసుకొంది. శనివారం సాయంత్రం చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ,చీరాల నుండి మార్టూరు వస్తోంది. యనమదల సెంటరులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనదారులను భయపెడుతున్నాయి. దానికి తోడు ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలకు గోతులు మరింత లోతుగా ఏర్పడ్డాయి. రోజూ ఈ గోతులలో మార్టూరు నుండి పర్చూరు వైపు గ్రావెల్, కంకరతో తరలివెళ్లే భారీ వాహనాలు కారణంగా రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. గోతులలో ఆర్‌టీసీ బస్సు టైర్లు ఇరుక్కుపోవడంతో గ్రామంలోని కొంతమంది యువకులు స్వచ్ఛందంగా సాయం చేయడంతో ఆర్‌టీసీ బస్సు గుంతలో నుంచి బయటపడి యథావిధిగా చీరాలకు వెళ్లిపోయింది.



యనమదల గ్రామంలో గుంతలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు



జీఎస్టీ తగ్గింపుపై జరిగిన ప్రదర్శనలో మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు

జీఎస్టీ తగ్గింపు వ్యాపారులకు గొప్ప అవకాశం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గత నెల 22 నుంచి అమలులోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 తో అన్ని వర్గాల ప్రజలకు, వ్యాపారులకు మరింత ప్రయోజనకరం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ వరకు ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పలు వస్తువుల ఎగ్జిబిషన్, విక్రయ కేంద్రాన్ని మంత్రి స్వామి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటు వ్యాపారులకు, ఇటు ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం శుభపరిణామం అన్నారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే వివిధ నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, కార్లు, బైక్‌లు ఇలా అందుబాటులోకి వచ్చిన వాటిని ప్రదర్శనగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారాలు మరింత అభివృద్ధి చెందుతాయని, అలాగే ప్రజలకు కూడా తక్కువ ధరలకు లభించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతారన్నారు. ముఖ్యంగా, వైద్యంలోనూ, వివిధ ఔషధాలలోనూ జీఎస్టీ తగ్గించడం వలన పేద, మధ్య తరగతి వారికి కూడా ఊరట లభిస్తుందన్నారు. కలెక్టర్ రాజా బాబు మాట్లాడుతూ ఆయా సంస్థల యాజమాన్యం, డీలర్లు ప్రత్యేక డిస్కౌంట్‌లతో కలిపి జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా వినియోగదారుల తగ్గిన రేట్లు ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బుల్లెట్, టీవీ కొనుగోలు చేసిన కస్టమర్లకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎం. సత్య ప్రకాష్, అసిస్టెంట్ కమిషనర్లు పి. రవికుమార్, సీహెచ్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కూలిన మిద్దెను చూపుతున్న బాధితురాలు నాగలక్ష్మమ్మ

వర్షాలతో కూలిన మిద్దె

గిద్దలూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని ఓ మిద్దె కూలిపోయింది. ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. గిద్దలూరు పట్టణంలోని కుమ్మరివీధిలో నాగలక్ష్మి అనే మహిళ ఉంటున్న మట్టిమిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు శుక్రవారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. కట్టుబట్టలతో మిగిలామని నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రేపు ఒంగోలులోనే 'మీ కోసం'

● మార్కాపురంలో వాయిదా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమం సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మార్కాపురంలో జరగాల్సి ఉండగా తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని మార్కాపురం డివిజన్‌లోని ప్రజలు గమనించాలని కోరారు. సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మీకోసం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మృతిచెందిన కుమారుడు హుస్సేన్‌ను చూసి రోదిస్తున్నతల్లి

నీటి కుంటలో పడి బాలుడు మృతి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గేదెలను మేపుకుంటూ కాలు కడుక్కునేందుకు నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి బాలుడు మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. గిద్దలూరు మండలం గడికోట పంచాయతీ తుమ్మళ్లపల్లె గ్రామసమీపంలో షేక్ హుస్సేన్ (15) శనివారం గేదెలను మేపేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తూ అక్కడే ఉన్న కుంట వద్దకు వెళ్లి కాళ్లు కడుక్కోవడానికి కుంటలోకి దిగాడు. కుంట లోతుగా ఉండడంతో ప్రమాదవశాత్తు హుస్సేన్ అందులో పడి మృతిచెందాడు. కుమారుడి మృతి చెందినట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అన్నీ సక్రమంగా ఉంటేనే పనులన్నీ చేసుకోవడానికి ఆపసోపాలు పడుతాం. అలాంటిది కీళ్ల వాతం వస్తే ఇక పరిస్థితి ఎలా ఉంటుందో ఊహిస్తేనే బాధగా ఉంటుంది. కదలడమే కాదు.. ఏ పనిచేయాలన్నా కీళ్లు తేలుకుట్టినట్లు మంటగా ఉంటాయి. కాలు కదిపినా కన్నీళ్లు వస్తాయి. చాలా కాలంగా సరైన మందులు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డ కీళ్లవాతం రోగులకు వైద్యంతోపాటు వ్యాయామమే ఉపశమనం కలిగిస్తుందని వైద్యులు వెల్లడిస్తున్నారు. ఆదివారం ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం.



కీళ్లవాతం.. కదలడం కష్టం..!

● నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందే
● వ్యాయామంతోనే సమస్యకు చెక్
● నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కీళ్లవాతం ఎందుకొస్తుందో తెలియకపోయినా, అది పెట్టే బాధ మామూలుగా ఉండదు. ఉదయం లేవగానే కీళ్లన్నీ పట్టేస్తాయి. కూర్చోవడం, లేవడం కష్టంగా ఉంటుంది. రుమటాయిడ్ ఆర్థరైటీస్ జబ్బు వల్ల కీళ్ల దగ్గర నొప్పి, వాపు విపరీతంగా ఉంటుంది. కదలిక తగ్గిపోతుంది. శరీరంలోని ఇతర అవయావలపై ప్రభావం ఉంటుంది. ఇది చిన్న కీళ్లలో మొదలై ఆ తర్వాత పెద్ద కీళ్లపై ప్రభావం చూపుతుంది.

లక్షణాలు ఎలా ఉంటాయి ?

ఈఆర్థరైటిస్ లక్షణాలు నాలుగు దశలుగా ఉంటాయి. మొదటగా జాయింట్ దగ్గర కర కర అనే శబ్దంతో మొదలవుతుంది. ఆ తర్వాత వాపు, భరించలేని నొప్పి, జాయింట్ యొక్క కదలిక చాలా భారంగా ఉంటుంది. మొదటి, రెండు దశలో మందులు వాడుతూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చు, రెండు, మూడవ దశలో ఫిజియోథెరపీ , లేక కొన్ని రకాల ఇంజక్షన్‌ల వలన నొప్పి నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఇక నాల్గవ దశలో ఉన్నవారికి కీళ్ల మార్పిడి తప్పనిసరి అవుతుంది.

ఒంగోలు జీజీహెచ్‌లో సాధారణ మందులతో సరి

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎముకలు, కీళ్ల వైద్యం అందుబాటులో ఉన్నా, ఆర్థరైటిస్ అనే వ్యాధికి సాధారణ మందులతోనే సరిపెడుతున్నారు. ముఖ్యంగా రుమటాలజీ ఆర్థరైటిస్‌కు పూర్తి స్థాయిలో వ్యాధి నయం అయ్యే పరిస్థితులు లేవనే చెప్పవచ్చు. రోజూ సుమారుగా వెయ్యికి పైగా ఓపీలు జీజీహెచ్‌కు వస్తున్నప్పటికీ అందులో రోజుకు 50 నుంచి 100 మంది వరకు కీళ్ల నొప్పులు సమస్యలతోనే రావడం గమనార్హం, అయితే మందులు వాడితే ఉపశమనం, ఆపితే తిరిగి యథావిధిగా రావడంతో ప్రయివేటు ఆసుపత్రుల బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్‌కి అత్యంత కీలకమైన కీలు మార్పిడికి శస్త్ర చికిత్స లేకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో రూ. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో కీలు మార్పిడి ఆపరేషన్‌లు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మొదటి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యం



ఆర్థరైటిస్ లక్షణాలను మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సులభతరం అవుతుంది. ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా కొన్ని జాగ్రత్తలు తీసుకుని వ్యాయామం ద్వారా, కొన్ని పనులు చేయడం, డాక్టర్ సలహాలు, సూచించిన మందుల వాటం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. ముఖ్యంగా ఫిజియోథెరపీ చేయడం ద్వారా ఎక్కువశాతం సమస్య నుంచి బయట పడవచ్చు. వేడి నీళ్ల కాపడం పెట్టడం కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఒకవేళ మోకాళ్లు పూర్తిగా అరిగిపోతే కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకోవడం అవసరం. అయితే కీళ్ల మార్పిడి ఆపరేషన్‌లపై అనేకమందిలో అపోహలు ఉన్నాయి. ఆపరేషన్ చేస్తే యథావిధిగా తిరిగి నడవవచ్చు.

- డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు


చెరువులకు జలకళ



● సాగర్ జలాలతో నిండిన వైనం
● మూగ జీవాలకు తీరనున్న దాహార్తి
● పెరగనున్న భూగర్భ జలాలు

ముండ్లమూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మోదేపల్లి మేజరు పరిధిలో ఉన్న చెరువులను సాగర్ జలాలతో నింపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్‌ఎస్‌పీ అధికారులతో మాట్లాడి చెరువులను పూరి స్థాయిలో సాగర్ జలాలను నింపించారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రానున్న వేసవి కాలంలో కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని పశుపోషకులు అంటున్నారు. మండలంలోని మారెళ్ళ, పూరిమెట్ల, భీమవరం, ఈదర, కొమ్మవరం, నాయుడుపాలెం, శంకరాపురం, నూజెండ్లపల్లి, ఉమామహేశ్వర అగ్రహారం చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. సుంకరవారిపాలెం, శంకరాపురంలో కుంటలను సైతం నింపారు. చెరువులకు నీరు నింపటం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరింది. భూగర్భ జలాలు పెరగటంతో మోటార్లకు కూడా నీరు పూర్తిగావచ్చి రైతుల పంటలకు కూడా ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా ఏర్పడింది. మారెళ్ల, నూజెండ్లపల్లి చెరువులు గత ఆరు సంవత్సరాల నుంచి పూర్తి స్థాయిలో నిండిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల్లో మూగ జీవాలు సైతం దాహార్తి కోసం అలమటించాయి. మండలంలో 50వేల వరకు మూగజీవాలు ఉన్నాయి. గతంలో చెరువుల్లో నీరు లేకపోవటం వల్ల మేత కోసం వెళ్ళిన పశువులు దాహార్తితో అల్లాడిపోయాయి. ప్రస్తుతం పది చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు నిండటంతో ఈసమస్య తీరింది. ఎన్‌ఎస్‌పీ డీఈ పూర్ణచందు నిత్యం మోదేపల్లి మేజరు కాలువపై పర్యటించి చెరువులకు నీరు నింపేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు.

సాగర్ జలాలతో కళకళలాడుతున్న పూరిమెట్ల చెరువు



నిండిన మారెళ్ల చెరువు

ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం

జీజీహెచ్‌లో సెంట్రలైజ్డ్ ఐసీయూ
ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక వసతులు
ప్రారంభంలో ఎమ్మెల్యే జనార్దన్



జీజీహెచ్‌లో సెంట్రలైజ్డ్ ఐసీయూను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం లభిస్తున్నదని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులోని జీజీహెచ్‌లో రూ. 41లక్షల వ్యయంతో నిర్మించిన సెంట్రలైజ్డ్ ఐసీయూను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సౌకర్యార్థం అవసరమైన ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రయివేటు ఆసుపత్రులకు దీటుగా అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఇంకా అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. జీజీహెచ్‌లో సమస్యలపై హెచ్‌డీఎస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీజీహెచ్‌లో కార్డియాలజీ విభాగంతో పాటు, ఇతర క్యాన్సర్, కీళ్లు, ఇతర స్పెషలైజేషన్ శస్త్ర చికిత్సలు అందిస్తామని తెలిపారు. ప్రజలు జీజీహెచ్‌లో వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావుమాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, అలాగే 24గంటల వైద్య సేవలు, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నదని తెలిపారు. సాధారణంగా ఉండే ఐసీయూను సెంట్రలైజ్డ్ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య మాట్లాడుతూ 2014-2019లో రోజూ రెండువేలకు పైగా ఓపీ ఉండేదని, అయితే ఆ తర్వాత క్రమంగా ఓపీ తగ్గిందని, కాగా తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవసరమైన వైద్యసేవలను అందిస్తున్నదని తెలిపారు. అలాగే ఆసుపత్రి అభివృద్ధిలో పలు స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

రాక్సీ డాగ్‌తో తనిఖీలు

ఒంగోలు క్రైం,అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈగల్ టీమ్ బృందాలు వారంలో రెండు దఫాలు రైళ్లలో తనిఖీలు చేస్తున్నాయి. ఇటీవల తనిఖీలలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న అనేక మందిని పట్టుకున్నారు. ఈ క్రమంలో బస్టాండ్‌లో, లాడ్జిలు,డార్మెటరీలపై పోలీసులు నిఘా పెట్టారు. టాస్క్‌ఫోర్స్ నేతృత్వంలో రాక్సీ డాగ్‌ను రంగంలోకి దించారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పార్శిల్ కార్యాలయం, డార్మెటరీ, బస్టాండ్ సమీపంలోని అన్నపూర్ణ లాడ్జితోపాటుగా పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా చేసేవారు డార్మెటరీలలో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఈ తరహా తనిఖీలకు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిత్యం ప్రధానమైన పట్టణాలలో తనిఖీలు చేయడం పరిపాటిగా మారింది. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. రాక్సీ డాగ్ గత నెలలో మొదటిసారిగా విధుల లోకి రావడంతోనే రైలులో గంజాయి తరలిస్తున్న బ్యాగ్‌లను పట్టుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా రాక్సీ డాగ్‌ను రంగలోకి దింపినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారలు చెబుతున్నారు. ప్రధానంగా గంజాయి తరలింపుపై దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఒంగోలు నగరంలో తనిఖీలు నిర్వహించినవారిలో ఎస్సైలు శివరామయ్య, చెంచయ్య, డాగ్ హ్యాండ్లర్ ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.



ఒంగోలు ఆర్టీసీ డిపోలో తనిఖీచేస్తున్న రాక్సీడాగ్‌తో పోలీసులు

స్మార్ట్ రేషన్ కార్డులతో నూతన అధ్యాయానికి శ్రీకారం

● పంపిణీలో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా పౌరసరఫరాల వ్యవస్థలో నూతన అధ్యాయాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులను జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, రేషన్ సరుకులు పొందే దుకాణ డీలర్ వివరాలతో ఏటీఎం కార్డు సైజులో ఈ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కలెక్టర్ పీ రాజాబాబు మాట్లాడుతూ దుర్వినియోగాన్ని నివారించేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6.51 లక్షల స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒడా చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ వేలిముద్రల సమస్యలకు చెక్‌పెట్టేలా కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత, కలెక్టర్ రాజాబాబు, ఒడా చైర్మన్ రియాజ్, జేసీ గోపాలకృష్ణ

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

స్మార్ట్‌కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత

అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు ● మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయ స్వామి

లబ్ధిదారులకు కార్డుల అందజేత ● ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, కూటమి నాయకులు



మూలగుంటపాడులో మహిళకు స్మార్ట్‌కార్డును అందజేస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రవేశపెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మండలంలోని మూలగుంటపాడు 12వ నంబర్ రేషన్ దుకాణంలో శనివారం నిర్వహించిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ కార్డుల వలన రేషన్ పంపిణీలో అవకతవకలకు అడ్డుకట్టు పడుతుందన్నారు. కార్డుపై కుటుంబ సభ్యుల వివరాలు ముద్రించి ఉన్నందున గుర్తింపు కార్డుగా కూడా వినియోగించుకొనే అవకాశం ఉంటుందన్నారు. స్మార్ట్ కార్డును స్కాన్ చేయడం ద్వారా రేషన్ ఏ తేదీ, ఏ సమయంలో, ఏ దుకాణంలో తీసుకొన్నది కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని ఆయన చెప్పారు.

కొండపిలో..



స్మార్ట్‌కార్డును అందజేస్తున్న రామయ్యచౌదరి

కొండపి: స్థానిక కుమ్మరిపాలెం రేషన్ షాపు పరిధిలో ఉన్న కార్డుదారులకు స్మార్ట్ కార్డులను ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, తెలుగు యువత నాయకుడు నేతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లిలో...

మండల కేంద్రమైన జరుగుమల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు శనివారం అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొణిజేడులో..



కార్డులను అందజేస్తున్న రామా గోపి

టంగుటూరు(కొండపి): మండలంలోని కొణిజేడు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ మండల నాయకుడు రామా గోపి శనివారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రామా శ్రీను, రామా సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పైరెడ్డిపాలెంలో...

పొన్నలూరు: మండలంలోని పైరెడ్డిపాలెంలో శనివారం ఏఎంసీ చైర్‌పర్సన్ కర్ల తిరుపతమ్మ ఆధ్వర్యంలో రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. తాసీల్దార్ వి. పుల్లారావు, టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, నాయకులు కర్ల కోటిరెడ్డి, గుమ్మల్ల వెంకట్రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్మార్ట్ రేషన్‌కార్డులను శనివారం మద్దిపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో టీడీపీ నియోజవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డులుగా రూపొందించడం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో నాయకులు మండవ గోపీనాథ్, మందపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మండవ శివానందరావు, చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, దేవబత్తిన ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..



స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న తహసీల్దార్

నాగులుప్పలపాడు: రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తుందని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్‌కార్డులను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. మరో వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. వాటి ద్వారా పేదలకు సక్రమంగా రేషన్ అందుతుందని, బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయవచ్చని టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, మాజీ జడ్పీ చైర్మన్ మారెళ్ల వెంకటశేషయ్య, డీటీ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎనికపాడులో..



స్మార్ట్‌కార్డులను అందజేస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి, హరిబాబు

సంతనూతలపాడు: తెల్లరేషన్ కార్డుల స్థానంలో మండలానికి స్మార్ట్ రేషన్‌కార్డులు 14,506 మంజూరయ్యాయని తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. ఎనికపాడులో శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబుతో కలిసి ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో అందజేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, రేషన్ డీలర్ నల్లూరి శ్రావణిగోపి, నాయకులు నల్లూరి వెంకట్రావు, బీవై.ప్రసాద్, బొడ్డపాటి చంద్రశేఖరరావు, నల్లూరి గోపి, ముళ్లమూరి ప్రసాదరావు, విక్రమ్, కోటయ్య, పుట్టా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీపీ విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించాలి

● విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్ గవర్నమెంట్ పార్ట్నర్‌షిప్(పీజీపీ) విధానాన్ని ప్రవేశపెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. ఈవిధానం ద్వారా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి ఎస్సీఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు డాక్టర్ విద్యను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం ద్వారా నిర్మించడం ద్వారా బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పేద విద్యార్థి, యువతకు అందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ నాగభూషణం, దంతం బెంజిమెన్, చిత్తూరి నరేష్, సూర్య, సాగర్, అచ్చిబాబు, దిలీప్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సేవా సంకల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందంచే ఆదివారం సంతనూతలపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను పరిశీలించి ఒక నెలకు సరిపడ మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. శిబిరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న సేవా సంకల్ప్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ప్రతినిధులు ఎస్‌వీ.రమణ, పీఎస్ఎస్.చౌదరి, కె.వెంకటేశ్వర్లు కోరారు.

ఘనంగా బాలికా దినోత్సవం

కొత్తపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మోటుమాల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ మాట్లాడుతూ బాలికలు చట్టాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునే దిశగా కృషి చేయాలని కోరారు. కాగా విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి రత్నప్రసాద్, ప్రిన్సిపాల్ మీరున్నిసాబేగం, ఉపాధ్యాయురలు కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

మద్దిపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నందిపాడు గ్రామంలో పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేలాదిమంది మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వరప్రసాద్ గురుకుల్ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి హోమాలు నిర్వహించినట్లు ప్రధాన పూజారి ఎన్.శ్రీనివాసశర్మ తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



కాంస్య పతకాన్ని అందుకుంటున్న ఆశాశ్రీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరుగుతున్న యోనెక్స్‌సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఒంగోలుకు చెందిన దండు ఆశాశ్రీ సత్తా చాటారు. శనివారం జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న పలువురు క్రీడాకారులతో పోటీపడుతూ ఆమె కాంస్య పతకం సాధించారు. ఇప్పటికే ఆల్ ఇండియా నెంబర్ ర్యాంకును కలిగిన ఆశాశ్రీ ఈ విజయాన్ని తన కెరీర్‌లో మరో ఘట్టంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఆమె బెంగళూరులోని ప్రకాష్ పడుకోన్ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్ సాగర్ చోప్రా మార్గదర్శకత్వంలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆశాశ్రీని పలువురు క్రీడాకారులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

కొండపి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కొండపికి చెందిన షేక్ ఆరిఫ్ (22) శుక్రవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమే అందుకు కారణమని తెలిసింది. ఎస్సై ప్రేమ్‌కుమార్ కథనం మేరకు.. ఆరిఫ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ కొండపి ప్రాంతానికి చెందిన యువతితో ఆయనకు పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమించాడు. ఆ యువతి అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. నాలుగు రోజుల క్రితం కొండపికి వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

చిన్నారులకు నేడు మెగా వైద్యశిబిరం

పొన్నలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరులోని సచివాలయంలో శక్తి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అశోక్‌చౌదరి తెలిపారు. పిల్లల్లో వచ్చే పోషకాహార లోపాల వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మద్దిపాడులోని లారీ యూనియన్ ఆఫీసు సమీపంలో శనివారం జరిగింది. ఒంగోలు నుంచి మేదరమెట్ల వెళుతున్న మోటార్‌సైకిల్ కారును అధికమించబోయి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో మేదరమెట్లకు చెందిన ఆర్.శ్రీనివాసరావు, ప్రసన్నలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

ట్రంకురోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు : మంత్రి స్వామి

సింగరాయకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో అధ్వానంగా ఉన్న ట్రంకురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసిందని మంత్రి స్వామి వెల్లడించారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కవిత, తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్, ఎంపీడీవో జయమణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.కాశయ్య, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, నేతలు షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, సుదర్శి చంటి, పార్టీ గ్రామ అధ్యక్షుడు సన్నెబోయిన మల్లికార్జున, ముళ్లపూడి సత్యనారాయణ, గుదే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

● మారిటైం బోర్డు చైర్మన్ సత్య



మాట్లాడుతున్న చైర్మన్ దామచర్ల సత్య

నాగులుప్పలపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. ఈదుమూడిలోని సంధ్య ఆక్వా కళ్యాణమండపంలో కూనం కోటయ్య చౌదరి, కుక్కపల్లి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కూనం కృష్ణకుమారి, డాక్టర్ శ్యాంప్రసాదరావు(యూఎస్ఏ) ఆధ్వర్యంలో చెన్నయ్‌కు చెందిన శంకర్ నేత్రాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని శనివారం చైర్మన్ సత్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంధ్యా ఆక్వా సంస్థ తమ సొంత నిధులతో పెద్ద ఎత్తున వారం రోజుల నుంచి వైద్యశిబిరం నిరహిస్తూ ఉచితంగా వైద్యపరీక్షలతోపాటు శస్త్రచికిత్సలు నిర్వహించడం గ్రామీణ ప్రజలకు వరమన్నారు. చెన్నయ్‌కు చెందిన వైద్య బృందం వెయ్యి మందికి పైగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించి 80 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లను చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కూనం కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ ఆళ్ల ప్రేమ్‌చంద్, కూనం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

17న మండల సమావేశం

మద్దిపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో జ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని ఆమె కోరారు.

చిన్నమొత్తాల పొదుపుతో ఆర్థిక పరిపుష్టి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ధనాన్ని పొదుపు చేసుకునే విధానాలు, మదుపు చేసే మార్గాలు విద్యార్థులు తప్పకుండా అన్వేషించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ఆర్థిక రంగ నిపుణుడు డా.ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మార్కాపురంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. కె.మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సుకు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చదువుకునే వయసు నుంచే ఆర్థికంగా బలపడడం కూడా ముఖ్యమన్నారు. ధనాన్ని పొదుపు చేసుకునే విధానాలు విద్యార్థులు అన్వేషించాలన్నారు. ప్రతిరోజు తల్లిదండ్రుల నుంచి మన అవసరాలకు తీసుకునే ధనంలో కొంతభాగం పొదుపు చేసుకోవటం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, సమన్వయకర్త పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యవిద్య ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ కొనసాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పేద ప్రజల వైద్యానికి హామీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలతోనే సాధ్యమన్నారు. సీపీఐ నేత అందె నాసరయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజలకు ఉచిత ఆరోగ్యం అందించే మెడికల్ కాలేజీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి.వీరారెడ్డి, సీఐటీయూ నాయకులు డీకేఎం.రఫి, జేవీవీ రాష్ట్ర సభ్యుడు జయప్రకాశ్, స్వరూపారెడ్డి, డాక్టర్ సీతారామశాస్త్రి, ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ.రఫి, ఎన్‌జీవో నాయకుడు రమేష్‌రెడ్డి, శరత్, జేవీవీ నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, ఏనుగుల రవికుమార్, బి.శ్రీరాములు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు రాయవరం గ్రామ పరిధి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పరిశీలించారు.

కూటమితోనే క్రైస్తవ మైనార్టీల సంక్షేమం

● టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు స్వామిదాసు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం సాధ్యపడుతుందని టీడీపీ క్రైస్తవ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు టీడీపీ కూటమి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. 2014-19లో క్రైస్తవుల కోసం సీఎం చంద్రబాబునాయుడు గుంటూరు, విజయవాడ సమీపంలో రెండెకరాల స్థలం కేటాయించి, క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి రూ.10 కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు. 80 శాతం పనులు పూర్తి కాగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులు నిలిపివేసి దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. క్రైస్తవుల అభివృద్ధిని వైసీపీ పాలకులు గడిచిన ఐదేళ్లలో కనీసం పట్టించుకోలేదని తెలిపారు. జగన్ హయాంలో పాస్టర్లకు క్రిస్మస్ కానుకగా రూ.30వేలు మాత్రమే ఇవ్వగా సీఎం చంద్రబాబునాయుడు రూ.లక్షకు పెంచారని గుర్తు చేశారు. అలాగే క్రైస్తవుల యాత్రలకు, విదేశీ విద్యకు, టైగర్ సంక్షేమ పథకాల కోసం బడ్జెట్‌లో రూ.150కోట్లు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సమావేశంలో ఒంగోలు టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు సాదు సుందర్‌సింగ్, పాతూరి రవికుమార్, తాతపూడి జాన్సన్, తెనాలి నాగేంద్రరావు, వేశపోగు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

● ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ విజయనిర్మల



విజయనిర్మలను సన్మానిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, అతిథులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం తగినంత చేయూత అందిస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ వేముల విజయనిర్మల పేర్కొన్నారు. శనివారం రాత్రి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ నాటక అకాడమీ ద్వారా రాష్ట్రంలో నాటకరంగ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుందని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం, కూటమి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం వారు వేముల విజయనిర్మలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీబీ మెలోడీస్ వారి సినీ సంగీత విభావరి, నెల్లూరు సుదర్శనం వారు ప్రదర్శించిన వంశవృక్షం నాటిక ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ దేనువకొండ సుబ్బయ్య, రంగభూమి కళాకారుల సంఘం కార్యవర్గ సభ్యులు ఎ.ప్రసాద్, వాకా సంజీవరెడ్డి, పి.వెంకటరామయ్య, మాకా ఆంజనేయులు, బాబూరావు, రంగారావు, నరేంద్ర, దిగ్విజయ్, వై.పూర్ణచంద్ర, పొదిలి బాలగురవయ్య, సబ్బు శ్రీను, ప్రేక్షకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో గ్రానైట్ పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తాం

● గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ

● ఫ్యాక్టరీ ఓనర్ల హర్షం

చీమకుర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): "పరిశ్రమల ప్రగతికి, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం సదా తోడ్పాటు అందిస్తుంది. మీరే కాస్త తొందరపడ్డారు.. ఫ్యాక్టరీలు మూతవేసి సమ్మె చేసి కార్మికులను రోడ్డున పడాల్సివేయాల్సింది కాదు. సమస్యలు ఉంటే మాకు తెలిపితే పరిష్కరిస్తాం కదా.. ఎందుకు ఇలా జరిగిందని శనివారం తనవద్దకు వచ్చిన గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులతో గనులశా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి సీనరేజి వసూలు ప్రైవేటీకరణ, సీనరేజి రేట్లను పెంచినందుకు నిరసిస్తూ చీమకుర్తి, రామతీర్థం, మర్రిచెట్లపాలెం, ఏలూరురోడ్ ప్రాంతంలో ఉన్న దాదాపు 800 గ్రానైట్ ఫ్యాక్టరీలు మూతవేసి సమ్మెలోకి వెళ్లారు. గత పదిరోజులుగా సమ్మె చేస్తూ ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులతో రెండు దఫాలుగా జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఫ్యాక్టరీ ఓనర్లు శనివారం చివరి ప్రయత్నంగా జిల్లాకు చెందిన మంత్రి స్వామిని కలవగా ఆయన గనులశాఖామంత్రి రవీంద్రతో ఫోన్‌లో సంప్రదించి అపాయింట్‌మెంట్ ఇప్పించారు. వెంటనే ఓనర్ల అసోసియేషన్ ప్రతినిధులు గనుల శాఖమంత్రితో గంటపాటు తమ సమస్యలను చర్చించారు. అన్ని ఓపికగా విన్న మంత్రి రవీంద్ర సానుకూలంగా స్పందించారు. రెండురోజుల్లో ఏఎంఆర్ సంస్థ, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసు కుంటానని హామీ ఇవ్వటంతో అ సోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, చలపతిరావు, లగడపాటి శ్రీనివాసరావు, సుబ్బారావు, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం రంగనాయకస్వామి కల్యాణం



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రాచర్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జేపీచెరువు అటవీ ప్రాంతం నల్లమల అడవుల్లోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. అర్చకులు అన్నవరం వెంకట రంగాచార్యులు, మాధవాచార్యులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరించారు. గిద్దలూరు కోర్టు న్యాయాధికారి భరత్ చంద్ర, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య, సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. వాతావరణం అనుకూలించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కాపు బలిజ సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సత్ర నిర్వాహకులు కన్నసాని గోపాల్, తోట చంద్రయ్య తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అవకతవకలకు చెక్

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్యూ ఆర్ కోడ్‌తో కూడిన నూతన స్మార్ట్ కార్డుల పంపిణీతో బోగస్ రేషన్ కార్డులు, ప్రజా పంపిణీలో అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం కంభం పట్టణంలోని రామాలయం వీధి, గచ్చుకాలువ, తిప్ప వీధుల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఇంటింటికీ తిరిగి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పౌరసరఫరాల శాఖలో నూతన అధ్యాయానికి స్మార్ట్ కార్డుల పంపిణీతో తెరలేపారన్నారు. దీనివల్ల అర్హులందరికీ సరుకులు సక్రమంగా అందుతాయి అన్నారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలు ఉంటాయన్నారు. 16నెలల పాలనలో జిల్లాలో 20వేలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు పథకాల అమలు, రాష్ట్ర అభివృద్ధి పనులు చేపడుతున్నారని అశోక్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట మహాలక్ష్మి, సొసైటీ బ్యాంకు చైర్మన్ కేతం శ్రీను, గోన చెన్నకేశవులు, నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని 7వ వార్డులో శనివారం స్మార్ట్ రేషన్ కార్డులను మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, పసుపులేటి శ్రీనివాసులు, మహిళ నాయకులు బొంతా లక్ష్మీదేవి పంపిణీ చేశారు. మండలంలోని ఉయ్యాలవాడ పంచాయతీలో గల అంకనాంపల్లెలో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాలక్రిష్ణయాదవ్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి నారాయణరెడ్డి, మండల ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.


కంభంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


దేవరాజుగట్టులో పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

పొదిలి : కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం రత్నం డీలర్‌షాపులో వినియోగదారులకు తహసీల్దార్ కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా ఉండేందుకు స్మార్ట్‌రేషన్ కార్డ్‌లు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రజల సౌలభ్యాన్ని స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని బోడపాడు, నాయుడుపల్లి, దరిమడుగు, పెద్ద యాచవరం తో పాటు పలు గ్రామాలలో శనివారం రెవెన్యూ అధికారులు కూటమి నాయకులతో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమం లో బోడపాడులో వీఆర్వో డీ రామయ్య, టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, రేషన్ కార్డుల లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్మార్ట్ రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలు ఉన్నా యని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు అన్నారు. తహసీల్దారు కా ర్యాలయం వద్ద నూతన స్మార్ట్ రేషన్ కార్డులను డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున నాయుడు, షేక్ మాబు, నాయకులు శనివారం లబ్ధిదారులకు అందజేశా రు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నా యకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, సుబ్బారెడ్డి, రావెళ్ల సత్యనారాయణ, షేక్ మౌలాలి, రఫీ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : స్మార్ట్ రేషన్ కార్డులు సమర్థవంతమైన పాలన, సేవలకు నిదర్శనమని ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్డులతో అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందుతాయని చేకూరి తెలిపారు. కార్యక్రమంలో డీటీ భాస్కర్, నాయకులు చిట్యాల వెంగళ రెడ్డి, సత్యనారాయణగౌడ్, అచ్యుతరావు, వెంకటసుబ్బయ్య, మస్తాన్ వలి, మంత్రునాయక్, అంజయ్య, రమేష్, సర్పంచులు, డీలర్లు, కార్డుదారులు పాల్గొన్నారు.

రాచర్ల : స్మార్ట్ కార్డుల వలన అక్రమాలకు చెక్ పడుతుందని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. స్మార్ట్ కార్డులను శనివారం ఆయన రాచర్ల, అనుములపల్లి గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. డీలర్లు మోసాలు, అక్రమాలు చేసే అవకాశం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కె యోగానంద్, నాయకులు పి సుధీర్‌కుమార్‌రెడ్డి, సనావుల్లా ఖాన్, ఎస్ కల్యాణ్ రెడ్డి, యు శంకర్ నాయుడు, డి కాశిరెడ్డి, పి బాలకృష్ణ, ఎస్ వెంకటపతి, బి కాశయ్య, పిచ్చయ్య, టి రమేష్ పాల్గొన్నారు.

పెద్దారవీడు : సుపరిపాలనతో వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని దేవరాజుగట్టులో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతముగా తీర్చిదిద్దేందుకు రూ.15కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్మార్ట్ కార్డులను అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వైపాలెంలో కార్డులను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్


గిద్దలూరులో పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్


తాడివారిపల్లెలో అధ్వానంగా ఉన్న రోడ్డు

తాడివారిపల్లెలో చినుకుపడితే బురదే

తర్లుపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడివారిపల్లెలో చినుకుపడితే బురదమయంగా మారుతుంది. గ్రామంలో ప్రధాన వీధుల్లో కూడా సైడు కాలువలు లేకపోవటంతో నీరంతా రోడ్డుపైకి వచ్చి కంపుకొడుతుంది. దీంతో ప్రజలు నడవాలంటే ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన వీధి, కోమటి బజారు అధ్వానంగా తయరై మురుగు నిల్వ కేంద్రంగా మారడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో మరింత దారుణంగా తయారైంది. రజకుల బజారు పేరుకే సిమెంట్ రోడ్డు అయినా ఇళ్ల ముందు కాలువలు సక్రమంగా లేకపోవడంతో పలు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు

పెద్దదోర్నాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నటరాజ్ కూడలిలో ఆర్ఎస్ఎస్ మార్కాపురం గ్రామీణ ఖండ కార్యవాహ టీ కిశోర్‌రెడ్డి అధ్యక్షతన శతాబ్ది వేడుకలు శనివారం నిర్వహించారు. ఏపీ ప్రాంత కుటుంబ ప్రబోధ పుట్ట శేషు పాల్గొని ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు చేసిన పలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆముదాల నరసింహులు, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

నాలుగోతరగతి ఉద్యోగుల నూతన కమిటీ


నూతనంగా ఎన్నికైన నాలుగో తరగతి ఉద్యోగులు

పొదిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొదిలి తాలూక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని స్థానిక ఎన్జీవోహోంలో శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కోమటికుంట వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షులుగా పాముల నారాయణ, ఉపాధ్యక్షులుగా కాకర్ల శ్రీనివాసులు, వై స్వర్ణలత, కార్యదర్శిగా పొదిలి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్‌కె అన్వర్ సాయి, రావెళ్ళ సంపూర్ణమ్మ, కోశాధికారిగా ఎస్‌కే షబ్బీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ ఎన్నికల అధికారులుగా గర్నెపూడి యోబు, కె రమాదేవీలు వ్యవహరించారు. కార్యక్రమంలో నాలుగోతరగతి సంఘం అధ్యక్షుడు విడుదల మురళీక్రిష్ణ, ఏపీ ఎన్జీవోస్ మాజీ ఉపాధ్యక్షుడు కె శ్రీరాములు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి బయనపల్లె నుంచి పెద్దచెరువు గ్రామానికి వెళ్లి వస్తున్న చేవూరు పాములేటి అనే వ్యక్తి కేఎస్‌పల్లె సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో గుర్తించిన హైవే పోలీసులు 108లో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెంబేలెత్తిస్తున్న కోతులు, కుక్కలు


ప్రధాన వీధిలో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

పెద్ద దోర్నాల,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దోర్నాలలో కోతులు, కుక్కలు విచ్చలవిడిగా వీధుల్లో తిరుగాడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.ప్రధానంగా నటరాజ్ కూడలి నుంచి అమ్మవారిశెల వీధి, పోలీసుస్టేషన్ వైపు, వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో పిల్లలు,వృద్ధులు, మహిళలు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. ఆందోళన ముఖ్యంగా రాత్రి పది గంటలు దాటితే తెల్లవారు జామున ఐదు గంటల వరకు వ్యాపార షాపుల ముందు మందలుగా చేరి వెళ్లేందుకు వీలు లేక ప్రజలు కర్ర చేత పట్టి నలుగురైదుగురు తోడుగా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.అర్ధరాత్రి వేరే గ్రామాల నుండి దోర్నాలకు వచ్చి ఇంటికి వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోందని, ముఖ్యంగా తిమ్మాపురం గ్రామ ప్రజలు వాపోతున్నారు.మరో ప్రక్క కుక్కలు కూడా వీధి వీధిన చేరి దాడులకు ఉపక్రమిస్తున్నాయి. చాలా సార్లు కోతులు, కుక్కలు దాడి చేసి గాయపర్చిన సంఘటనలు కూడా లేకపోలేదు.అంతేగాక పగలు వీధుల్లో ఆవులు రోడ్లపైనే తిరుగుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పశువులపాకగా అంగన్‌వాడీ కేంద్రం

గిద్దలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పాఠశాల భవనం పశువుల పాకగా మారింది. గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లి గ్రామంలో గత వైసీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. అయితే అవి పూర్తిస్థాయిలో రాకపోవడంతో పాఠశాల భవనాన్ని మధ్యలోనే ఆపివేశారు. కొత్తగా నిధులు మం జూరు కాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నది. దాంతో ఆప్రాంతంలోని రైతులు తమ పశువులను అంగన్‌వాడీ కేంద్రంలోనే కట్టి మేత వేస్తున్నారు. దాంతో పాఠశాల భవనం పశువుల పాకగా మారింది. అధికారులు చర్యలు తీసుకుని అందుబాటులోకి తేవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల భవనంలో ఉన్న పశువులు


కోటగడ్డవీధిలో తనిఖీ చేస్తున్న జిల్లా ఆరోగ్య విస్తృత అధికారి

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఎఫ్ఆర్ఎస్ వేసుకోవాలని జిల్లా ఆరోగ్య విస్తృత అధికారి బెల్లం నరసింహారావు అన్నారు. శనివారం పట్టణంలోని కోటగడ్డవీధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ ప్రకాశంను పాటించాలన్నారు. మలేరియా, క్షయ, కుష్ఠ నిరోధక టీకాల కార్యక్రమాల లక్ష్యాను సాధించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సూర్యచంద్ర, సూపర్‌వైజర్ సుధారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నమొత్తాల పొదుపుతో ఆర్థిక పరిపుష్టి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ధనాన్ని పొదుపు చేసుకునే విధానాలు, మదుపు చేసే మార్గాలు విద్యార్థులు తప్పకుండా అన్వేషించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ఆర్థిక రంగ నిపుణుడు డా.ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. కె.మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సుకు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చదువుకునే వయసు నుంచే ఆర్థికంగా బలపడడం కూడా ముఖ్యమన్నారు. ధనాన్ని పొదుపు చేసుకునే విధానాలు విద్యార్థులు అన్వేషించాలన్నారు. ప్రతిరోజు తల్లిదండ్రుల నుంచి మన అవసరాలకు తీసుకునే ధనంలో కొంత భాగం పొదుపు చేసుకోవటం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, సమన్వయకర్త పవన్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గిద్దలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పరిశీలించారు. పనులను నాణ్యంగా, వేగంగా చేపట్టాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. టికెట్ కౌంటర్లు, వెయిటింగ్ రూములు, ఫుడ్‌స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించారు.

కమనీయం స్వామివారి కల్యాణం

రాచర్ల : మండలంలోని జేపి చెరువు అటవీ ప్రాంతం నల్లమల అడవుల్లోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. అర్చకులు అన్నవరం వెంకట రంగాచార్యులు, మాధవాచార్యులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరించారు. గిద్దలూరు కోర్టు న్యాయాధికారి భరత్ చంద్ర, మున్సిపల్ కమిషనర్ రమణ బాబు, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. వాతావరణం అనుకూలించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కాపు బలిజ సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సత్ర నిర్వాహకులు కన్నసాని గోపాల్, తోట చంద్రయ్యలు తెలిపారు.


స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అధిక ధరలకు మద్యం సీసాలను అమ్మితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు హెచ్చరించారు. పట్టణ, మండల పరిధిలో బుధవారం ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు సిబ్బందితో కలిసి మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్‌పి ధరలను పరిశీలించి షాపులో గల స్టాక్‌ను ఆయన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : మద్యంను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని గిద్దలూరు ఎక్సైజ్ ఎస్సై కె రాజారెడ్డి అన్నారు. రాచర్ల వెంకటేశ్వర వైన్స్ షాపును శనివారం ఆయన తనిఖీ చేశారు. షాపులో నిల్వ ఉన్న మద్యం సీసాలు, వాటి వివరాలు గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు, అమ్మకాలు, మిగులు స్టాకు ధరల విక్రయం అన్ని రికార్డులో నమోదు చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని అన్నారు.


తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ జయరావ్

పలు దుకాణాలకు జరిమానా

గిద్దలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖల అధికారులు గిద్దలూరు, రాచర్ల మండలంలోని పలు దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఎమ్మార్పీ కన్నా అధికంగా విక్రయిస్తున్న 5 కూల్ డ్రింక్ షాపులపై కేసులు నమోదు చేసి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధించినట్లు అధికారి మోసిన్ తెలిపారు. అలాగే మరో 4 దుకాణాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య ప్రజారోగ్య వ్యవస్థ కొనసాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య హక్కులకు పేద ప్రజల వైద్యానికి హామీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలతోనే సాధ్యం అన్నారు. సీపీఐ నేత అందె నాసరయ్య మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంత ప్రజలకు ఉచిత ఆరోగ్యం అందించే మెడికల్ కాలేజీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి.వీరారెడ్డి, సీఐటీయూ నాయకులు డీకేఎం రఫి, జేవీవీ రాష్ట్ర సభ్యుడు జయప్రకాశ్, స్వరూపారెడ్డి, వైద్యులు డా. సీతారామశాస్త్రి, ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ రఫి, ఎన్జీవో నాయకుడు రమేష్ రెడ్డి, శరత్, జేవీవీ నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, ఏనుగుల రవికుమార్, బి.శ్రీరాములు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు రాయవరం గ్రామ పరిధి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని జేవీవీ నాయకులు వెంకట్రావు, జయప్రకాష్, స్వరూపరెడ్డి, రవికుమార్, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కంభంలో సంతకాల ఉద్యమం

కంభం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్య మ కార్యక్రమం శనివారం జరిగింది. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమిలిదిన్నె చెన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కుందూరు నాగార్జునరెడ్డి, కేవీ రమణారెడ్డి, ఎం పీపీ, జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


సంతకాల సేకరణలో పాల్గొన్న వైసీపీ నాయకులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి మహాకుంభాభిషేకం మహోత్సవం, నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 15న జరుగుతున్న నేపథ్యంలో శనివారం మహాగణపతి పూజతో ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మొదటి రోజు శివాలయంలో గణపతి హోమం పూజతో పాటు నాభిశిల విగ్రహం వద్ద గణపతి పూజలు ప్రారంభమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

పామూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నుచ్చుపొద గ్రామ జాతీయ రహదారిపై శనివారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇనిమెర్ల నుంచి బైక్‌పై పామూరుకు వస్తున్న మండాడి అజిల్, పామూరు నుంచి తూర్పుకట్టకిందపల్లి గ్రామానికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు అజిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంసీ కార్యదర్శిని పరామర్శించిన టీడీపీ నేతలు

పామూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పామూరు మండలం చిలకపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రవిచంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. పామూరు నుంచి కనిగిరికి బైకుపై వెళుతూ అదుపుతప్పి గాయపడ్డారు. కనిగిరిలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనను శనివారం ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, పామూరు పాత చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాలపర్తి రమణయ్య పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సలహామేరకు విశ్రాంతి తీసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఏబీఎం ఆస్తుల పరిరక్షణకు చర్యలు

దొనకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఏబీఎం ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టేందుకు సంసిద్ధం అవుతున్నామని ఏబీఎం చర్చి ప్రాపర్టీల రాష్ట్ర పెద్దలు శిఖ జాన్‌జ్యోతి పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం చర్చి ఆవరణలో శనివారం బాప్టిస్ట్ పాస్టర్ల సమావేశం నిర్వహించారు. డిక్రీ హోల్డర్స్ డి. అనీల్‌రాజ్, డి.సునీల్‌రాజ్, జాన్‌జ్యోతిలు సీఎస్ 124/94 కేసులో మద్రాసు హైకోర్టు ఏబీఎం చర్చి ఆస్తులపై ఇచ్చిన తీర్పును, ప్రాపర్టీ పూర్వపరాలను వివరించారు. దొనకొండ, దర్శిలోని ఏబీఎం చర్చి స్థలాలు కొన్నవాళ్లు, ఆ స్థలాల్లో కట్టడాలు కట్టుకున్నవారు ఖాళీ చేసి సంస్థకు అప్పగించాలని మద్రాసు హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.కార్యక్రమంలో దొనకొండ ఏబీఎం చర్చి ప్రెసిడెంట్ ఎండీ సుధాకర్, సెక్రటరీ ఎస్.సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ముండ్లమూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన కోనంకి ఆరోన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు దిరిశాల శ్రీనివాసరావు మృతుని కుమారుడు రామకోటయ్యకు శనివారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అదే పంచాయతీ పరిధిలోని రమణారెడ్డిపాలెంకు చెందిన దమ్ము నిమ్మేను అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుమారుడు సురేష్‌కు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

మైనర్ కాలువలోకి మురుగునీరు మళ్లింపు

చోద్యం చూస్తున్న అధికారులు



దర్శి మైనర్ కాలువలోకి మళ్లించిన మురుగునీరు



మైనర్ కాలువలోకి మళ్లించిన వైద్యశాలలోని మురుగునీరు

దర్శి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దర్శి మైనర్ కాలువలోకి యథేచ్ఛగా మురుగునీటిని మళ్లిస్తున్నారు. అనేకచోట్ల మురుగుకాలువల్లోని నీటిని వదులుతుండటంతో సాగర్ జలాలు కలుషితం అవుతున్నాయి. పంటలసాగుకు దర్శి మైనర్ కాలువల ద్వారా విడుదలవుతున్న సాగర్‌జలాలు మురుగునీరు కలిసి కలుషితం అవుతుండటంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువలో నుంచి ప్రారంభమైన దర్శి మైనర్ కాలువ దర్శి పట్టణం మధ్యలో నుంచి వెళుతుంది. దర్శిలో అనేక చోట్ల మురుగుకాలువల్లో నీటిని మైనర్ కాలువలోకి మళ్లించారు. ఓహాస్పిటల్‌లోని మురుగును ప్రత్యేకంగా కాలువను ఏర్పాటుచేసి మళ్లించారు. దీంతో కలుషితమైన సాగర్ జలాలు దుర్వాసన వెదజల్లుతుండటంతో పొలాల్లో నీరు పెట్టుకుంటున్న రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎంతోకాలంగా ఈతంతు కొనసాగుతున్నా ఎవరు పట్టించుకోకపోవడంతో క్రమేపి మరికొన్నిచోట్ల మురుగునీటిని మళ్లించేందుకు కొత్తకాలువలు తీస్తున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాసౌలభ్యం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజాసౌలభ్యం కోసమే స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ ద్వారా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయటమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా అందించే సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. నూతనంగా మంజూరైన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు మరింత మేలు చేకూరనుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంతోమంది వృద్ధులు పింఛన్ రాకుండా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇలాంటి దశలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పేదలకుటుంబాల లబ్ధికోసం తల్లిదండ్రులకు వేరుగా స్మార్ట్ రేషన్ కార్డును మంజూరు చేసిందన్నారు. సంతానంలో ఎవరికివారి కుటుంబానికి వేరుగా కార్డులు మంజూరుచేసినట్టు చెప్పారు. తద్వార వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న సంతానంలోని బిడ్డలకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. ఇది కూటమి ప్రభుత్వ పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. కొత్త రేషన్ కార్డుల్లో ఎలాంటి తప్పులు ఉన్నా వెంటనే వాటిని సరి చేయించుకోవాలని సూచించారు. ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయల పరిధిలో, రేషన్ డీలర్ షాపుల పరిధిలోని కార్డులు అందజేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 73,873 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. కనిగిరి మండలంలో 25,935 కార్డులు మంజూరయ్యాయన్నారు. పామూరు మండలంలో 17,731, సీఎస్‌పురంలో 11,761, హనుమంతునిపాడులో 8,364, పీసీపల్లిలో 10,082, వెలిగండ్లలో 9,975 కార్డులు మంజూరైనట్టు చెప్పారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, జంషీర్, పాలపర్తి వెంకటేశ్వర్లు, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), వేమూరి రామయ్య, షేక్ ఫిరోజ్, యారవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దర్శి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగావకాశాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా దర్శి నియోజకవర్గంలో టీచర్ పోస్టులు సాధించిన 59 మంది ఉపాధ్యాయులను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పించటం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేకపోవటం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, సాంబశివరావు, సీహెచ్ సుబ్బారావు, షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిని ప్రజాసేవగా భావించాలి

దర్శి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని ప్రజాసేవగా భావించి సేవలందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని చలివేంద్ర కొండ వద్ద నిర్మించనున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తిని వ్యాపారంగా మారకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజు, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లూరులో రేషన్ డీలర్లకు స్మార్ట్ కార్డులు పంపిణీచేస్తున్న తహసీల్దార్, నేతలు

స్మార్ట్ కార్డులతో..

» తహసీల్దార్ బీవీ రమణారావు

రేషన్ పంపిణీలో పారదర్శకత

తాళ్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీకోసమే స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రభుత్వం చేపట్టిందని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులో కుటుంబసభ్యుల వివరాలు నమోదుచేసి ఉంటాయన్నారు. ప్రతిస్మార్ట్ కార్డులో క్యూఆర్ కోడ్, రాష్ట్ర చిహ్నం, కుటుంబ యజమాని ఫొటో పెద్దదిగా ఉంటుందన్నారు. మండలంలోని 32 రేషన్ దుకాణాల పరిధిలో 14,115 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరయినట్టు చెప్పారు. తాళ్లూరు-2 దుకాణంలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, జనసేన నేత మారిశెట్టి హనుమంతరావు, ఈఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు, డీలర్ నాదెండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: స్మార్ట్ రేషన్‌కార్డులు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరమని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ముండ్లమూరులో స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏవైనా ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే స్మార్ట్ రేషన్ కార్డు ఉపయోగపడుతుందన్నారు. ముండ్లమూరుతో పాటు అన్ని రేషన్ దుకాణాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమైందన్నారు. డీలర్లు లబ్ధిదారుల సంతకాలు తీసుకొని కార్డులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేదర మెట్ల నారాయణమ్మ, మాజీ సర్పంచ్ మేదర మెట్ల వెంకటరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, బేతపూడి రామారావు, పిచ్చారావు, వీరపనేని శ్రీనివాసరావు, వీఆర్‌వో కావూరి దయానందం, డీలర్ వీరపనేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దర్శి: దర్శి పట్టణంలోని రేషన్‌కార్డుదారులకు శనివారం మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య రేషన్ స్మార్టు కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్డుల ద్వారా లబ్ధిదారులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, యాదగిరి వాసు, జూపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పామూరు మండలానికి 17731 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు అన్నారు. శనివారం లబ్ధిదారులకు కనిగిరిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అందజేశారు.

సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన సీఐ

కనిగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ప్రముఖుడు అద్దంకి రంగబాబుకు శనివారం స్థానిక కాస్మోపోలిటన్ క్లబ్‌లో టెన్నిస్ ఆడుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. అక్కడే టెన్నిస్ ఆడుతున్న సీఐ ఖాజావలి వెంటనే రంగబాబుకు సీపీఆర్ చేసి సాధారణ స్థితికి తీసుకువచ్చి ప్రాణాపాయం నుంచి తప్పించారు. సమీపంలో ఉన్న మున్సిపల్ చైర్మన్ గఫార్ వెంటనే తన కారులో రంగబాబును స్థానిక సంజీవని హాస్పిటల్‌లో చేర్పించారు.

ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ రంగబాబును పరీక్షించి సరైన సమయంలో సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని తెలిపారు. రంగబాబు ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో అందరూ ఊపరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉంటే సీఐ ఖాజావలి వలే ఆపదలో ఉన్న వారిని ప్రాణాలు కాపాడవచ్చునని చెప్పారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ

బాలికా సంరక్షణతోనే దేశ ప్రగతి

కనిగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని నారపరెడ్డిపల్లి గ్రామంలో శనివారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలే ఇంటికి, దేశానికి ప్రగతి అని పేర్కొన్నారు. పురిటిలోనే కొంతమంది ఆడశిశువును భ్రూణ హత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆడపిల్లల సంరక్షణ కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. బేటీ బచావో, బేటీ పడావో అనే నినాదంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లలకు ఉచిత చదువు, ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఆడపిల్లలను బతకనివ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాలు, గ్రుడ్లు, తదితర వాటిని తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన నీరు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తద్వారా రోగాలు దరిచేరవన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లి పాలు ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో పోషణా మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఎం.రమణమ్మ, పి.కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలుడు మృతి

ముండ్లమూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామానికి చెందిన తోట సుబ్రహ్మణ్యం, కోమలి దంపతుల కుమారుడు ధనుష్(2) జ్వరంతో బాధపడుతూ మృతిచెందాడు. గత రెండు మూడు రోజుల నుంచి జలుబు, దగ్గు, జ్వరంతో బాధ పడుతుండగా తల్లిదండ్రులు పల్నాడు జిల్లా విన కొండలోని ఓప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం శనివారం నర్సరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బిడ్డ చనిపోవటంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ముగిసిన ఆటల పోటీలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని డీజీపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాలబాలికల ఆటలపోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ఎంఈవో జైప్రసాదరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రసూల్, డి.వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళల అభివృద్ధి



సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న వీవోఏలు, టీడీపీ నేతలు

తాళ్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని వీవోఏల సంఘం అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్స్(వీవోఏ)ల మూడు సంవత్సరాల పదవీకాలం నిబంధనలను నిలుపుదలచేస్తూ జీవో జారీ చేయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శనివారం మండలంలోని వీవోఏలు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలబిషేకం చేశారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పొదుపు సంఘాలను ఏర్పాటుచేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, వెలుగు ఏపీఎం దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమిచ్చిన స్థలాన్ని కబ్జా చేశారు!

» దివ్యాంగురాలు ఆవేదన



డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్‌కు ఫిర్యాదు చేస్తున్న మల్లికార్జునరావు, దివ్యాంగురాలు

కనిగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమిచ్చిన స్థలాన్ని కబ్జా చేశారని దివ్యాంగురాలు శనివారం రాష్ట్ర దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లికార్జునరావుతో కలిసి డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్‌కు ఫిర్యాదు చేసింది. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీకి చెందిన చియాద్రి బుజ్జి (అంధ దివ్యాంగురాలు)కి ప్రస్తు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి 2012లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సర్వే నెంబర్ 895,899లో 75వ ప్లాట్‌ను కేటాయించారు. తమ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవటంతో అక్కడ నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల పట్టణ సమీపంలోని టకారిపాలెంకు చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి సూరాపాపిరెడ్డి కాలనీ, ఇందిరాకాలనీకి చెందిన వ్యక్తులు కలసి బాధితరాలు పేరుతో దొంగ వేలిముద్రలు వేయించి చల్లగిరగల గ్రామానికి చెందిన ముంగర లుథియమ్మ అనే మహిళ పేరుతో కొనుగోలు చేసిట్టుగా అగ్రిమెంట్ చేయించారని డీఎస్పీ ఎదుట కన్నీటి పర్యంతమైంది. ప్రస్తుతం వారు కబ్జా చేసిన స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని, అది తెలిసివెళ్లి అడిగితే టకారిపాలెంకు చెందిన ఇస్మాయిల్ దౌర్జన్యం చేస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ చేయించి తమ ప్లాట్‌ను ఇప్పించాలని బాధితురాలు వేడుకున్నారు.

ఆదమరిస్తే అంతేసంగతులు

» విద్యార్థుల భద్రతను పట్టించుకోని సిబ్బంది

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు. విద్యార్థుల భద్రతను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద పాఠశాల భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. నాటి పాలకుల అసమర్థతతో ఆ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. పిల్లర్లు వేసి వదిలేశారు. కనీసం అంచులకు గోడల ఏర్పాటుచేయలేదు. ప్రమాదభరితంగా ఉన్న ఆ భవనం విద్యార్థులు ఎక్కకుండా జాగ్రత్తలు పాటించాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం రెండవ అంతస్తులో విద్యార్థులు చక్కర్లు కొడుతున్నారు. భవనంపైన విద్యార్థులు జారిపడితే ప్రాణాపాయం సంభవించే పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ఉపాధ్యాయులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



నాందేడ్ - అనకాపల్లి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నాందేడ్, అనకాపల్లి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07037 నాందేడ్ - అనకాపల్లి రైలు ఈ నెల 14 నుంచి నవంబరు 25 వరకు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి నడికుడి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.15కి అనకాపల్లి చేరుకొం టుంది. 07038 అనకాపల్లి - నాందేడ్ రైలు ఈ నెల 15 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1.15కి బయలుదేరి రాత్రి 8.55కి గుంటూరుకు చేరుతుంది. ఆ తర్వాత స నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 10 గంటలకు నాందేడ్ చేరుకొంటుందన్నారు.



కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థులకు సైకిళ్ల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 356 మంది విద్యార్థులకు శనివారం సైకిళ్లను పంపిణీ చేశారు. సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డైనింగ్ హాల్, రూ.15.56 లక్షల పీఎంశ్రీ నిధులతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ పథకం ద్వారా సెయిల్ ఎనర్జీ ఇండియా వెయ్యి సైకిళ్లను సమకూర్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నేతృత్వంలో మెగా డీఎస్సీలో 16,300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు.

రూ.1.85 కోట్లతో అభివృద్ధి పనులు..

కొండమంజులూరులో రూ.1.85 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. సాలిపేట, వడ్డెరకాలనీలో రూ.65 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. గ్రామంలోని కొండపైకి రూ.కోటితో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పంగులూరు, అద్దంకి, కోరిశపాడు మండలాలకు చెందిన 57 కుటుంబాలకు రూ.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్.ఓ.సి.లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎం.పీ.డీ.ఓ. స్వరూపారాణి, తహసీల్దార్ శ్రీచరణ్, ఈఈ మస్తాన్‌రావు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల వెంకటరావు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, రావులసింగరకొండ, గొల్లపూడి అంజయ్య, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాసరెడ్డి, శింగర్, నార్నె సుబ్బారావు, శ్రీను, గరిమిడి జగన్, వరపర్ల సుబ్బారావు, చంద్రశేఖర్, అశోక్, సత్యవర్ధన్, గరిమిడి జగన్, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ రైతుబంధు

- అన్నదాతలకు మరింత మేలు



గతంలో రూ.140 కోట్లు రుణాలు

రైతుబంధు పథకం కింద 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.140 కోట్లు రుణాలను అన్నదాతలకు ఇచ్చింది. రైతులకు ఇచ్చే రుణాలపై తొలి ఆరు నెలల పాటు ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకుండా రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఆరు నెలలు తర్వాత నుంచి దిగుబడులను అమ్ముకునేంత వరకు రైతులు 12 శాతం వడ్డీ చెల్లించేవారు. రుణ సౌకర్యం లక్ష వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది.

28 యార్డులు.. రూ.60 కోట్లు లక్ష్యం

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో మొత్తం 28 వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో గిడ్డంగులు ఉన్నాయి. ఆయా యార్డుల పరిధిలో రైతుబంధు పథకాన్ని ఈ ఖరీఫ్ దిగుబడులు వచ్చే సరికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతానికి దాదాపు రూ.60 కోట్లు రుణాలను ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇప్పటికే మండలాల వారీగా వచ్చే పంట ఉత్పత్తులను అంచనా వేస్తున్న మార్కెటింగ్ అధికారులు రైతులకు ఎంతమేర రుణాలు ఇవ్వాలి.. దిగుబడుల నిల్వలకు గిడ్డంగుల్లో సౌకర్యాలపై కసరత్తు చేస్తున్నారు.

- దిగుబడుల నిల్వపై రుణ సౌకర్యం పథకం పునరుద్ధరణకు ప్రభుత్వ నిర్ణయం
- ఖరీఫ్ దిగుబడుల నాటి నుంచే అమలుపై కసరత్తు
- రైతులకు మేలు చేసే పథకాన్ని నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రకృతి వైపరీత్యాలు.. తెగుళ్లను అధిగమించి అష్టకష్టాలు పడి సేద్యం చేసి మంచి దిగుబడులు వచ్చేనాటికి మార్కెట్‌లో సరైన ధర లేకపోతే అన్నదాత పడే వేదన అంతాఇంతా కాదు. ఒక వైపు పెట్టుబడుల కోసం అధిక వడ్డీకి తెచ్చిన అప్పులు తరుముతుంటే గత్యంతరం లేని పరిస్థితుల్లో దిగుబడులను అయినకాడికి అమ్ముకుని నష్టాలు మూటగట్టుకోవడం రైతులకు పరిపాటిగా మారుతోంది. ఈ పరిస్థితి మారాలని 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. దిగుబడుల సమయంలో బహిరంగ మార్కెట్‌లో రైతు ఆశించిన ధర లేకపోతే ఉత్పత్తులను మార్కెట్ యార్డు గోదాముల్లో నామ మాత్రపు అద్దెకు నిల్వ చేసుకునే సదు పాయం కల్పిం చడంతో పాటు సదరు పంటకు మార్కెట్ విలువలో 75 శాతం రుణం రూపంలో ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)



రైతుబంధు అమలయ్యే యార్డులు	
బాపట్ల జిల్లా:	రేపల్లె, కూచినపూడి, పర్చూరు, అద్దంకి, బాపట్ల, వేమూరు, చీరాల, సంతమాగులూరు
పల్నాడు జిల్లా:	వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, క్రోసూరు, గురజాల, రొంపిచర్ల, ఈపూరు, దుర్గి, పిడుగురాళ్ల, నరసరావుపేట, దాచేపల్లి, పెదకూరపాడు
గుంటూరు జిల్లా:	గుంటూరు, తెనాలి, పొన్నూరు, దుగ్గిరాల, తాడికొండ, మంగళగిరి, ఫిరంగిపురం, ప్రత్తిపాడు



ప్లాట్ ఫాంపై పెండింగ్ పనులు

నత్తనడకన రైల్వే పనులు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- రెండేళ్లుగా కొలిక్కిరాని అమృత్ భారత్ పనులు

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ సర్కారు స్కీంలో బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్లలో చేపట్టిన అభివృద్ధి పనులు రెండేళ్లుగా కొలిక్కిరాలేదు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. భారతీయ రైల్వే మౌళిక వసతుల కల్పనలో భాగంగా చీరాల, బాపట్ల రైల్వేస్టేషన్లను ఆధునికీకరిస్తున్నారు. చీరాల రైల్వేస్టేషన్‌కు రూ.17 కోట్లు, బాపట్లకు ప్రత్యేక నిధులతో రెండు దశల్లో పనులు చేపట్టారు. ఆయా రైల్వేస్టేషన్లలో ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, షెడ్లు, పెయిడ్ విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, పార్కు, ఫ్లోరింగ్ వంటి పనులను నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరో ఏడాది పట్టే అవకాశం ఉన్నట్లు ప్రస్తుతం జరుగుతున్న పనులను బట్టి అర్థమవుతుంది. చీరాలలో ఎఫ్‌వోబీ పనుల కారణంగా ప్లాట్‌ఫాంలపై అడ్డంగా పట్టాలు కట్టి ఉంచారు. చీరాలలో ఎస్కలేటర్లకు లోడు టెస్ట్ నిర్వహించినా ఇంతవరకు ప్రారంభం కాలేదు. గార్డెన్ల పనులు ఇప్పటికీ మొదలే కాలేదు. బాపట్లలో మాత్రం ప్రస్తుతానికి మొదటి దశ పనులు ముగిసినట్లు అధికారులు చెబుతున్నారు. దివ్యాంగుల సౌకర్యాలకు సంబంధించిన పనులు జరు గుతున్నాయన్నారు. ఎఫ్‌వోబీ పనులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.



నిర్మాణంలో ఎస్కలేటర్

పత్తి... విలవిల

- ఉసురు తీస్తున్న వర్షాలు
- వీడని వర్షాలతో రైతులకు తీవ్రనష్టం



నీటిలో నానుతున్న పత్తి



వర్షాలకు తడిచి నల్లగా మారిన పత్తి కాయలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి సాగుకు ప్రకృతి సహకరించడం లేదు. అతివృష్టి లేదంటే అనావృష్టితో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరుసగా ఆరేళ్లుగా పత్తి సాగు కలిసిరాక రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూస్తున్నారు. ఏ యేటికాఏడు మంచి దిగుబడులు వస్తాయి.. నష్టాల నుంచి గట్టెక్కవచ్చని సాగు చేపడుతున్న రైతుల ఆశ అడియాసగానే మారుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది అయినా కలిసివస్తోందని ఆశించిన రైతులు పత్తి సాగుకు సిద్ధమయ్యారు. అయితే ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు కురవక పత్తి సాగు ఆలస్యమైంది. దీంతో ఆగస్టులో విస్తృతంగా పత్తి సాగు చేపట్టారు. సాగు విస్తీర్ణం గత సీజన్ కంటే గణనీయంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో 2,18,337 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,575 ఎకరాల్లో, గుంటూరు జిల్లాలో 57,107 ఎకరాల్లో పత్తి సాగైంది. గత ఏడాది కంటే 56,582 ఎకరాల్లో పెరిగింది. అయితే విత్తనం విత్తిన దగ్గర నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలాల్లో నీరు నిలిచి పైరు ఉరకెత్తి దెబ్బ తింటోంది. నేల తడి ఆరకముందే వానలు కురుస్తున్నాయి. ఎండ కాయకుండా మబ్బులు కమ్ముకుంటున్నాయి. దీంతో పత్తి పూత రాలిపోతోంది. ఆకులు ఎర్రబారుతున్నాయి. కాయలు నల్లగా మారి రాలిపోతున్నాయి. పచ్చని ఆకులు, తెల్లని దూదితో కళ కళలాడాల్సిన పొలాలు వెలవెలబోతున్నాయి. పైరు ఎండిపోతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వర్షాలతో పాటు వరదలు ముంచెత్తుతున్నాయి. కృష్ణానదికి వరద పోటెత్తుతుండటంతో నదీ పరివాహ ప్రాంతంలో, వాగు సమీపంలోని పత్తి పొలాలు ముంపునకు గురై పూర్తిగా పంట దెబ్బతిన్నది. అటు వరదలు.. ఇటు వర్షాలు పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగించాయి.

పత్తి పీకేసి మొక్కజొన్న..

చేతి కందాల్సిన పంట వర్షార్పణం అవుతుండటంతో రైతులు కన్నీటి పర్యం తమవుతున్నారు. పత్తి సాగుకు పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఉరకెత్తి ఎండి పోతుండటంతో పత్తి మొక్కలు పీకేసి మొక్కజొన్న సాగుకు రైతులు సమాయత్తమ వుతున్నారు.

ధీమా ఇవ్వని బీమా

పత్తి పంటను వాతావరణ ఆధారిత బీమా పథకంలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. పేరుకే ఈ బీమా ఉందే తప్ప నష్టపోతున్న రైతులను ఆదుకుంటున్న దాఖలాలు లేవు. పత్తి సాగు చేసిన రైతుల్లో 25 నుంచి 30 శాతం మంది రైతులు వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పంటకు నష్టం జరిగినప్పుడు సాగుదారులకు ఆర్థిక రక్షణ కల్పించాలి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కన్నా రెండు నుంచి మూడు రెట్ల అధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దీంతో పత్తి పంటకు వాతావరణ బీమా పథకం కింద నష్టపరిహారం చెల్లించాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వాతావరణ ఆధారిత బీమా పథకం లబ్ధి సాగుదారులకు అందడంలేదు.



నగదు బదిలీల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యూపీఐ నగదు బదిలీల్లోనూ వ్యాపారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగదు స్వీకరించాలనుకుంటే పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరంలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. యూజర్లు అప్రమత్తంగా లేకపోవటంతోనే చాలావరకు యూపీఐ మోసాలు జరుగుతుంటాయన్నారు. ఎవరైనా దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేసి నగదు చెల్లిస్తామని ఫోన్ లేదా యూపీఐ పిన్ అడుగుతున్నారంటే వారు మోసం చేస్తున్నారని గ్రహించాలన్నారు. యూపీఐ పేమెంట్స్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు గురించి ప్రజలు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దుకాణాదారులు అపరిచిత వ్యక్తులకు యూపీఐ పిన్ నమోదు సంఖ్య చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే పోయిన నగదు తిరిగి పొందడం కష్టమని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ పే, గూగుల్ పే, ఇతర పేమెంట్ యాప్‌ల ద్వారా నగదు చెల్లిస్తామంటూ మొబైల్‌కి రిక్వెస్ట్ పంపి ఖాతాలోని డబ్బులు మొత్తం దొంగలిస్తారన్నారు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ఇతరులకు ఇవ్వరాదన్నారు. సైబర్ మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నెంబరు 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

పోటీతత్వంతో ముందుకు సాగాలి

- రెవెన్యూ క్రీడల ప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మాదిరిగానే దైనందిన జీవితంలోనూ గెలుపే లక్ష్యంగా పోటీతత్వంతో ముందుకు సాగాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శనివారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. జాతీయజెండా, రెవెన్యూ అసోసియేషన్ జెండాలను ఆవిష్కరించారు. తదుపరి వాలీబాల్ సర్వీస్ చేసి కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అన్ని అం శాల్లో జిల్లా క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించాలన్నారు. గెలుపు సాధించడమే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరని ఉద్యో గులకు చెప్పారు. విధి నిర్వాహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. ప్రభుత్వకార్యక్రమాల పురోగతిలో రెవెన్యూ ఉద్యోగుల బాధ్యత కీలకమని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి వెళ్లే క్రీడాకారులు అధికంగా పతకాలు సాధించాలని చీరాల, రేపల్లె ఆర్డీవోలు టి.చంద్రశేఖర్, రామలక్ష్మి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెవెన్యూ ఉద్యోగులు అందించే సేవలు మరువలేనివని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



చినగంజాంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.16.50 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు
- ఎమ్మెల్యే ఏలూరి చొరవతో ప్రత్యేకంగా నిధులు

చినగంజాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చినగంజాం మండల పరిధిలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవ తీసుకుని ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 99 పనులకు రూ.16.50 కోట్లతో నిధులు మంజూరయ్యాయి. చినగంజాం పంచాయతీలో మొదటి విడతతో రూ.1.18 కోట్లతో 11 పనులు చేశారు. రెండో విడతలో రూ.1.70 కోట్లతో 11 పనులు ఆమోదించారు. చింతగుంపల్లెలో మొదటి విడతలో రూ.19 లక్షలతో ఒక పని పూర్తి చేయగా, రెండో విడతలో రూ.25 లక్షలతో మరో పని చేపట్టనున్నారు. గొనసపూడిలో మొదటి విడతలో రూ.66.5 లక్షలతో ఆరు పనులు పూర్తిచేయగా, రెండో విడతలో 7 పనులకు రూ.1.64 కోట్లు మంజూరు చేశారు. కడవకుదురులో మొదటి విడతలో రూ.65 లక్షలతో నాలుగు పనులు పూర్తి చేయగా, రెండో విడతలో రూ.70 లక్షలతో ఆరు పనులను ఆమోదించారు. సంతరావూరులో మొదటి విడతలో రూ.85.50 లక్షలతో నాలుగు పనులు పూర్తి చేయగా, రెండు పనులు పురోగతిలో ఉన్నాయి. రెండో విడతలో 4 పనులకు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. మోటుపల్లిలో మొదటి విడతలో రూ.85.50 లక్షలతో నాలుగు పనులు పూర్తి చేయగా, రెండు పనులు పురోగతిలో ఉన్నాయి. రెండో విడతలో రూ.50 లక్షలతో నాలుగు పనులు చేపట్టనున్నారు. నీలాయపాలెంలో మొదటి విడతలో రూ.17 లక్షలతో రెండు పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.30 లక్షలతో రెండు పనులు చేపట్టనున్నారు. పల్లెపాలెంలో రూ.37 లక్షలతో నాలుగు పనులు చేశారు. రెండో విడతలో మూడు పనులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పెదగంజాంలో రూ.5.37 కోట్లతో 22 పనులకు నిధులు మంజూరయ్యాయి. కొత్తగొల్లపాలెంలో రూ.3.67 కోట్లతో 9 పనులు చేపట్టారు. రెండో విడతలో 8 పనులకు రూ.1.15 కోట్లు మంజూరయ్యాయి. కొత్తపాలెంలో రూ.30 లక్షలతో రెండు పనులు చేపట్టాల్సి ఉంది. మున్నంవారిపాలెంలో రెండు పనులకు రూ.30 లక్షలు, రాజుబంగారుపాలెంలో రెండు పనులకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి.



శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షా భక్తులు (ఫైల్)

శింగరకొండలో హనుమాన్ దీక్షకు ఏర్పాట్లు

● దశాబ్ద కాలం క్రితం ప్రారంభం

● ఏటికేడు పెరుగుతున్న భక్తులు

● 23న మండల, నవంబరు 12న అర్ధమండల దీక్షలు

అద్దంకి,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి):శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమద్వ్రతం సందర్భంగా డిసెంబర్ 3న హనుమాన్ దీక్షల విరమణ, ఇరుముడుల సమర్పణ ఉంటుందని ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. ఈ నెల 23న మండల దీక్ష చేపట్టే భక్తులు మాలాధారణ, నవంబరు 12న అర్థ మండల దీక్ష భక్తులు మాలాధారణ చేసి దీక్షలు చేపట్టనున్నారు. దీక్షలు పూర్తయిన తరువాత డిసెంబరు 3 న హనుమ ద్వ్రతం సందర్భంగా మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి నిర్వహించి దీక్షా విరమణ చేయనున్నారు. 10 సంవత్సరాల క్రితం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి వచ్చే భక్తులు హనుమాన్ దీక్షలు తీసుకోవడం ప్రారంభించారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలలోని పలు గ్రామాల నుంచి భక్తులు హనుమాన్ దీక్షలు తీసుకొని స్వామివారికి ఇరుముడులు సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఇరుముడులతో వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ముందు రోజు రాత్రి నుండి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దీక్షా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. దీక్ష తీసుకొనే భక్తుల సంఖ్య ఏటికేడు పెరుగుతోందని ఈవో తిమ్మనాయుడు తెలిపారు. వందల సంఖ్యలో భక్తులు ఇరుముడులతో వచ్చి స్వామి వారికి సమర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా మండల దీక్ష, అర్ధ మండల దీక్ష లు తీసుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



ఢిల్లీ ముఠా సభ్యులను ప్రశ్నిస్తున్న పోలీసులు

విదేశీ టూర్ పేరుతో ఢిల్లీ ముఠా టోకరా

● పోలీసుల అదుపులో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు

● పరారీలో మరో ముగ్గురు

● నెల్లూరులో ఓ బాధితుడి ఫిర్యాదు

● అక్కడి పోలీసుల సమాచారంతో ఒంగోలులో హోటల్‌పై దాడి

ఒంగోలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విదేశీ టూర్ పేరుతో ఢిల్లీ ముఠా రాష్ట్రంలో మోసాలకు పాల్పడుతూ ఒంగోలు పోలీసులకు పట్టుబడ్డారు. శనివారం ఒంగోలు నగరంలోని మౌర్య ఇన్‌లో బస చేసిన వారిని పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి సమపంలోని నోయిడాకు చెందిన పది మంది ముఠా మకాం వేసి నగరంలోని వ్యాపార ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలకు వల వేసి ఫోన్‌ల ద్వారా పిలిపించుకుని వారం రోజులు దుబాయి టూర్ కోసం రూ. 2.25 లక్షల ప్యాకేజీ పేరుతో వసూళ్ళు ప్రారంభించారు. విహారయాత్రకు వెళ్లేందుకు కొంతమంది డాక్టర్లు, వ్యాపారవేత్తలు అడ్వాన్సు పేరుతో లక్షల రూపాయలు చెల్లించారు. అయితే పదిహేను రోజుల క్రితం నెల్లూరులో ఇదే ముఠా అనేకమందిని మోసం చేసి భారీగా డబ్బులు వసూలు చేశారు. దీంతో ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నెల్లూరు పోలీసుల దర్యాప్తులో భాగంగా ఈ ముఠా సెల్‌ఫోన్‌ల టవర్ ఆధారంగా ఒంగోలు చేరుకున్నట్లు గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావుకు విషయాన్ని తెలియజేయడంతో అప్రమత్తమై మౌర్య ఇన్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. తాలూకా సీఐ విజయ్‌కృష్ణ, పోలీసు సిబ్బంది ఆకస్మింగా తనిఖీలు చేసి ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు మొత్తం ఏడుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. అయితే ముఠాకు మోసపోయిన బాధితుడైన ఓ డాక్టర్ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 17వతేదీన జిల్లా స్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి పి. శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూపు విభాగంలో ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, ప్రసంగం, పద్యరచన, కథారచన, చిత్రలేఖనం, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు నిర్వహిస్తామన్నారు. జిల్లా యువజనోత్సవాల్లో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి యువజోత్సవాలకు జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 12న జరిగే జాతీయయువజనోత్సవల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఖర్చుతో పంపుతామన్నారు. జిల్లాలోని 15నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ఈనెల 15వతేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9573464848, 9182891095 నెంబర్లను సంప్రదించాలని శ్రీమన్నారాయణ కోరారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మార్కాపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ ఎస్ఐ అంకమ్మ రావు శనివారం తెల్లవారుజామున మండలంలోని తిప్పాయపాలెం వద్ద పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దదోర్నాల నుంచి నంద్యాలకు అక్రమంగా 60 బస్తాలలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీకి చెందిన బాషా, నారాయణరెడ్డి, ఫణిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

బాలికలందరూ బడికి రావాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష

మార్టూరు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ప్రతి బాలిక బడికి రావాలని, చక్కగా చదువుకోవాలి, బాలికలకు బంగారు భవిష్యత్తు విద్యద్వారానే లభిస్తుందని, అంగనవాడీ సూపర్ వైజరు శిరీష అన్నారు. అంతర్జాతీయ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 'బాలికలను రక్షిద్దాం- బాలికలను చదివిద్దాం' కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరులో రాయల్ పయనీర్ విద్యాలయంలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బాలికలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల చదువు ద్వారా సమాజం ముందడుగు వేస్తుందన్నారు. సంపత్‌నగర్, ఆర్‌జేఎస్‌టి కాలనీ, మద్దిసీతాదేవినగర్ లలో బాలికలతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు గుంజి అంజలి, దేవి, నాగపుష్పరాణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెపై కదలిక

▸ గ్రానైట్ సమస్య తీవ్రతను చర్చించుకున్న మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ స్వామి

▸ వారివురినీ కలిసి ఆవేదన వెలిబుచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు

▸ మరోవైపు స్వామి, జనార్దన్, కలెక్టర్ భేటీ

▸ స్థానికంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ

▸ సానుకూల పరిష్కారం వైపు అందరి దృష్టి

చీమకుర్తి ప్రాంత గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమ్మెపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఫ్యాక్టరీల యజమానుల ఆవేదనను సానుకూలంగా అర్థం చేసుకొని వారికి వెసులుబాటు కలిగేలా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వంలో పెద్దలు కదిలారు. ఇందుకు సంబంధించి శనివారం పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు ఈ అంశంపై ఫోన్‌లో మాట్లాడుకొన్నారు. సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయానికి వచ్చారు. మంత్రి స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు సమావేశమై స్థానికంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.



మంత్రి కొల్లు రవీంద్రను కలిసివినతిపత్రం ఇస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు

ఒంగోలు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న అనిశ్చితిపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఆ మేరకు ఇద్దరు మంత్రులు ఈ విషయంపై దృష్టిపెట్టి చర్చలు జరిపారు. అలాగే స్థానికంగానూ ప్రభుత్వ పెద్దలు సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మైనింగ్ రాయల్టీ వసూళ్లను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించిన నేపథ్యంలో గ్రానైట్ పరిశ్రమలో కలకలం రేగింది. అలాగే ఇక్కడ కాంట్రాక్టు పొందిన ఏఎంఆర్ సంస్థ పోకడపై చీమకుర్తి ప్రాంత ఫ్యాక్టరీల యజమానులు తీవ్ర అభ్యంతరం, ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుత విధానంతో ఫ్యాక్టరీల భవిష్యత్ ఆందోళనకరమని, పరిశ్రమల మనుగడే కష్టమని వారు భావిస్తున్నారు. ప్రధానంగా ప్రస్తుతం కట్టర్‌కు రూ.35వేలు రాయల్టీగా ప్రభుత్వానికి చెల్లిస్తుండగా దానితోపాటు అదనంగా మరో రూ.30వేల నుంచి 35వేలు ఆ సంస్థ కోరుతున్నదని చెప్తున్నారు. అలా అయితే తాము తీవ్రంగా నష్టపోతామని, పరిశ్రమలుమూసివేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రానైట్ క్వారీల్లో జరిగే చిన్నచిన్న లోపాలను హేతుబద్ధంగా పరిశీలించకుండా వాటిని ఆసరా చేసుకొని తమపై భారం మోపుతున్నారన్న ఆందోళనతో చీమకుర్తి ప్రాంతంలోని 800 ఫ్యాక్టరీల యాజమనులు ఈనెల 1 నుంచి సమ్మెబాట పట్టారు.

ఉపాధిపై దెబ్బ.. అంతా వెలవెల

సమ్మెతో ఫ్యాక్టరీలలో పనులు నిలిచిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మంది ఉపాధిపై దెబ్బపడింది. వలస కూలీల్లో ఎక్కువ మంది సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. వెళ్లిపోయారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే చీమకుర్తి ప్రాంతంలోని రామతీర్థం, మర్రిచెట్లపాలెం సెంటర్లు వెలవెలబోతున్నాయి. పదిరోజులుగా పెద్దగా ప్రభుత్వ పరంగా స్పందన కనిపించకపోగా శనివారం పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఉదయం జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామిని తూర్పునాయుడుపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారికంగా ప్రభుత్వం వసూలు చేసే రూ.31వేల రాయల్టీకి అదనంగా మరో రూ.35వేలు వసూలుకు సిద్ధపడటం దారుణమన్నారు. ప్రస్తుతం తమకు ఇస్తున్న 22 మీటర్ల అనుమతికి బదులు 35 మీటర్లు ఇవ్వాలని కోరారు. వాటితోపాటు మరికొన్ని విషయాలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రి కొల్లుతో ఫోన్‌లో మాట్లాడిన స్వామి

మంత్రి స్వామి ఈ విషయమై రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రకు ఫోన్ చేసి మాట్లాడారు. సమస్య తీవ్రత, కీలకమైన గ్రానైట్ పరిశ్రమ మూత, దీంతో నెలకొన్న పరిణామాలపై వారిద్దరు చర్చించుకొని సానుకూల పరిష్కారం చూపాలన్న నిర్ణయానికి వచ్చారు. మంత్రి స్వామి సూచనల మేరకు ఫ్యాక్టరీల యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మధ్యాహ్నం విజయవాడ వెళ్లి గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి తమ ఆవేదనను వివరించారు. అసోసియేషన్ ప్రతినిధులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, కన్నూరి సుబ్బారావు తదితరులు మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు. ఉన్నతాధికారులు, ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి రవీంద్ర అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

కలెక్టర్ చాంబర్‌లో సమావేశం

ఇదే విషయమై శనివారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబులు భేటీ అయి చర్చించారు. ప్రకాశం భవనంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వారు.. ముందుగా అరగంటపాటు కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమ సమ్మె, ఇతర మైనింగ్ అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.. ఫ్యాక్టరీ యజమానుల ఆవేదనను అర్థం చేసుకొని పరిశ్రమకు ఇబ్బంది కలుగకుండా స్థానికంగా చర్యలు తీసుకోవాల్సి ఉందని, ఆ వైపు దృష్టిపెట్టాలని మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్‌లు ఆ సందర్భంగా కలెక్టర్ రాజాబాబుకు సూచించారు. ఇసుక విషయంలో కొందరు గనుల అధికారుల తీరును ఎమ్మెల్యే తప్పుబడుతూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం.

సార్లొస్తున్నారు!

▸ రేపటి నుంచి విధుల్లోకి కొత్త టీచర్లు

▸ ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న కొరత

▸ ఉమ్మడి జిల్లాలో 657 మంది నియామకం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి శిక్షణ తరగతులు ముగిశాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వారిని నియమించారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు, మునిసిపాలిటీలు, గిరిజన పాఠశాలల్లో 673 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 657 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అభ్యర్థులు ఎంపికైనప్పటికీ వివిధ కారణాలతో నిరాకరించారు. మరో 11 ఉపాధ్యాయ పోస్టులకు అర్హత ఉన్న వారు లేక భర్తీ చేయలేదు. ప్రస్తుతం 657 ఉపాధ్యాయ పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థులకు కేటగిరీ-3 పాఠశాలల్లో నియ మించినట్లు సమాచారం. అందుకు సంబం. ధించిన ప్రక్రియను విద్యాశాఖ అధికారులు పూర్తిచేసినట్లు తెలిసింది. డీఎస్సీలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 3 నుంచి 9వతేదీ వరకు శిక్షణ ఇచ్చారు. వారికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించారు. వెంటనే పాఠశాలల్లో చేరేందుకు కొత్త వారు సిద్ధమయ్యారు. ఆయా స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ఇప్పటికే కేటగిరి-3లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయు ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వాటిల్లో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త వారిని నియమించారు. తద్వారా ప్రభుత్వ పాఠశాల లకు పూర్వవైభవం వచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

● ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ విజయనిర్మల

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం తగినంత చేయూత అందిస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ వేముల విజయనిర్మల పేర్కొన్నారు. శనివారం రాత్రి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ నాటక అకాడమీ ద్వారా రాష్ట్రంలో నాటకరంగ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుందని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం, కూటమి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిప థంలో పయ నిస్తు న్నాయ ని పేర్కొన్నారు. అ నంతరం వారు వేముల విజయ నిర్మలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్బీటీ మెలీడీస్ వారి సినీ సంగీత విభావరి, నెల్లూ రు సుదర్శనం వారు ప్రదర్శించిన వంశవృక్షం నాటిక ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ ధేనువకొండ సుబ్బయ్య, రంగభూమి కళాకారుల సంఘం కార్యవర్గ సభ్యులు ఎ.ప్ర సాద్, వాకా సంజీవరెడ్డి, పి.వెంకటరామయ్య, మాకా ఆంజనేయులు, బాబూరావు, రంగారా వు, నరేంద్ర, దిగ్విజయ్, వై.పూర్ణచంద్ర, పొదిలి బాలగురవయ్య, సబ్బు శ్రీను, ప్రేక్షకులు పాల్గొన్నారు.



విజయనిర్మలను సన్మానిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

మళ్లీ.. రైతుబంధు

(5వ పేజీ తరువాయి)

అందించింది. ఈ పథకం వల్ల రైతులు మార్కెట్‌లో ఆశించిన ధర వచ్చే వరకు ఉత్పత్తులను నిల్వ చేసుకునేవారు. మొత్తం విలువలో 75 శాతం మేర వడ్డీలేని రుణం అందేది కాబట్టి ఆ మొత్తాలతో అప్పులు సైతం తీర్చుకునే వారు. ఈ పథకం రైతులకు భారీ ప్రయోజనం చేకూర్చింది. వ్యాపారుల సిండికేట్ మాయాజాలానికి కూడా రైతుబంధు పథకం కొంత మేర అడ్డుకట్ట వేయగలగింది. దీంతో గిట్టుబాటు ధరకే దిగుబడులను అమ్ముకుని రైతులు స్వల్ప లాభాలను అయినా గడించేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు పథకానికి గ్రహణం పట్టించింది. పైగా మార్కెట్ యార్డు గోదాములను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చింది. రైతుబంధు పథకాన్ని కొనసాగించాలని రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు కోరినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. నిల్వ చేసు కున్న దిగుబడులపై రుణ సదుపాయాన్ని రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు పెంచుతామని వైసీపీ ప్రభు త్వంలో చేసిన ప్రకటనలు అమలుకు నోచు కోలేదు. పైగా పథకాన్నే పూర్తిస్థాయిలో పడకేయించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తిరిగి ప్రారంభించాలని ఇటీవల నిర్ణయం తీసుకుంది. పథకం అమలుపై మార్కెటింగ్ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలను కూడా జారీ చేసింది. ఖరీఫ్ దిగుబడుల నాటి నుంచే రైతుబంధు పథకాన్ని రైతులకు అందుబాటులో తెచ్చేలా కసరత్తు చేస్తున్నారు. రైతుబంధు పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ దిగుబడుల వేళ నిల్వలపై ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.60 కోట్లు రుణాలను ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

వైద్యవిద్య ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు

● మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ కొనసాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పేద ప్రజల వైద్యానికి హామీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలతోనే సాధ్యమన్నారు. వైద్యకళాశాలలను ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేత అందె నాసరయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజలకు ఉచిత ఆరోగ్యం అందించే మెడికల్ కాలేజీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి.వీరారెడ్డి, సీఐటీయూ నాయకులు డీకేఎం.రఫి, జేవీవీ రాష్ట్ర సభ్యుడు జయప్రకాశ్, స్వరూపారెడ్డి, డాక్టర్ సీతారామశాస్త్రి, ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ.రఫి, ఎన్‌జీవో నాయకుడు రమేష్‌రెడ్డి, శరత్, జేవీవీ నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, ఏనుగుల రవికుమార్, బి.శ్రీరాములు, వివిధ సంఘా ల నాయకులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు రాయవరం గ్రామ పరిధి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పరిశీలించారు.

ప్రత్యామ్నాయం వైపు మిర్చి రైతు చూపు

మార్కాపురం డివిజన్‌లో తగ్గిన సాగు విస్తీర్ణం

పెరిగిన మొక్కజొన్న, బొప్పాయి సాగు

మార్కాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పం టల్లో రారాజు మిర్చి. అన్నీ అనుకూలిస్తే రైతులకు సిరుల పంటే. ఎన్ని ప్రతికూలతలు ఉన్నా ధరలు బాగుం టే రైతులు రూ.లక్షల్లో ఆదాయం తీసుకువచ్చేది ఈ పంటే. పశ్చిమ ప్రకాశంలో గతంలో మిర్చి పంట సాగు చేసిన రైతులు బాగానే లాభాలు ఆర్జించారు. అయితే రెండేళ్లుగా మిరప నష్టాల ఘాటు చూపిస్తోంది. ఒకవైపు తెగుళ్లు, మరోవైపు దిగుబడులు తగ్గడం, ఇంకోవైపు గిట్టుబాటు ధర లేకపోవడం, యాజమాన్య ఖర్చులు పెరగడం, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగ్గా లేకపోవడం తదితరాలతో రైతు లు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. దీంతో ప్రస్తు తం మిర్చి సాగు చేయాలంటేనే భయపడుతున్నారు. రెండేళ్లుగా క్రమేపీ సాగు విస్తీర్ణం తగ్గుతోంది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మరలుతున్నారు. ఏదో కొద్దిపాటి విస్తీర్ణంలో మాత్రమే మార్కాపురం డివిజన్ లో సాగవుతోంది.

ఏటికేడు తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో వాణిజ్య పంటల్లో పొగాకు, మిర్చి ప్రధానమై నవి. పొగాకు ఎక్కువగా రబీ సీజన్‌లో సాగవుతుంది. మిర్చి ఖరీఫ్ చివర నుంచి ప్రారంభమై రబీ మధ్య వర కు నాటుతారు. వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్‌లో కూడా అధిక మొత్తంలో సాగవుతుంది. జిల్లాలో మిర్చి సాధారణ విస్తీర్ణం 75వేల ఎకరాల వరకు ఉంటుంది. అందులో 50 వేల ఎకరాల వరకు మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల్లోనే సాగు చేస్తారు. రెండేళ్ల క్రితం జిల్లాలో సాధారణ విస్తీర్ణాన్ని మించి మరో 20వేలు ఎకరాలు సాగైంది. దీంతో 95వేల ఎకరాలకు చేరింది. గతేడాది సుమారు 40వేల ఎకరాల మేర తగ్గి 55వేల ఎకరాలకే పరిమితమైంది. అందులో మార్కాపురం డివిజన్‌లోనే 41,871 ఎకరాల్లో సాగు చేశారు. ఎన్నడూలేని విధంగా అధిక వర్షాలు, విపరీతమైన తెగుళ్లు, కనీస గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో రూ.లక్షల్లో రైతులు నష్టపోయారు. దీంతో ఇప్పుడు మిర్చి అంటేనే వెనకడుగు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరకు డివిజన్‌లో 8వేల ఎకరాల్లో మాత్రమే మిర్చి నాట్లు వేశారు. రబీలో మరో 10 నుంచి 15వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెప్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే మార్కాపురం డివిజన్‌లో సాగు విస్తీర్ణం 50 శాతానికి పైగా తగ్గినట్లే.

మొక్కజొన్న, బొప్పాయి వైపు మొగ్గు

మిరప సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులు ఈ సంవత్సరం ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న, బొప్పాయి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా బొప్పాయి సాగు పెరిగింది. ఎక్కువగా మొక్కలు లభించేది ఎర్రగొండపాలెంలోనే. అయితే డిమాండ్ ఎక్కువగా ఉండడంతో మహారాష్ట్ర, అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బొప్పాయి మొక్కలను దళారులు తెచ్చి రైతులకు అమ్మారు. అదేవిధంగా మొక్కజొన్న కూడా ఎక్కువగా సాగైంది. ప్రస్తుతం కంపెనీలకు చెందిన ప్రతినిధులు సీడ్ కోసం రైతులకు పెట్టుబడి ఇచ్చి మరీ సాగు చేయించారు. ఖరీఫ్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా విత్తన మొక్కజొన్న ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. రబీలో డిసెంబర్‌లో కూడా మళ్లీ రైతులు మొక్కజొన్న వేసే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక బాగా నష్టపోయిన కొందరు మిర్చి రైతులు మెట్ట పంటలైన కంది, మినుము, సజ్జ, నువ్వులు, జూట్, ఆముదం సాగు చేశారు. యాజమాన్య ఖర్చులు తక్కువగా ఉండడంతో ఆ వైపు రైతులు మరలారు.



తర్లుపాడు మండలం కారుమానిపల్లె వద్ద మిర్చి వేసే పొలంలో సాగు చేసిన బొప్పాయి

సగానికిపైగానే సాగు తగ్గించాం



గతంతో పోల్చితే సగానికి పైగానే మిర్చి సాగు తగ్గించాం. ఒకప్పుడు 5 నుంచి 10 ఎకరాలు సాగు చేసే రైతులు ప్రస్తుతం రెండు నుంచి మూడు ఎకరాలకు మించి వేయడం లేదు. గత సంవత్సరం బాగా నష్టాలు వచ్చాయి. నేను మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేసి రూ.2లక్షల మేర నష్టపోయాను. ప్రస్తుతం మెట్ట పంట కంది సాగు చేశాను. **- వెన్నా వెంకటరెడ్డి, బొడిచెర్ల, మార్కాపురం మండలం**

తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయాం



నేను గత సంవత్సరం 8 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ఎన్నడూలేని విధంగా తెగుళ్ల చుట్టుముట్టాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా లాభం లేకపోయింది. దిగుబడి పూర్తిగా తగ్గింది. కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. పండిన కొద్దిపాటి పంటను తక్కువ ధరకు అమ్మలేక గుంటూరు మిర్చి యార్డులో ఏసీలో పెట్టాను. ఈ సంవత్సరం రెండు ఎకరాలు మాత్రమే మిర్చి వేశా. 4 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశా.

కంది చిన్ననారాయణరెడ్డి, కారుమానుపల్లి, తర్లుపాడు

అవీ..ఇవీ..

కారు బోల్తా.. ఇరువురికి గాయాలు

పంగులూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కారు తిరగబడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని ముప్పవరం ప్రధానకూడలిలో 16వ నెంబరు జాతీయరహదారి ఫ్లైఓవర్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. హైవే మొబైల్ సిబ్బంది సమాచారం మేరకు కియాకారులో నలుగురు వ్యక్తులు విజయవాడ నుంచి నెల్లూరు వెళుతున్నారు. ఈ కారు శనివారం వేకువజామున రెండుగంటల సమయంలో ముప్పవరం వద్ద ఫ్లైఓవర్‌పైకి చేరుకునే సమయంలో టైరు బరస్టయి, తిరగబడింది. పక్కన ఉన్న చిలకలూరిపేటవైపు వెళ్లే రహదారిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎం.బాబూరావు, సీహెచ్. అనిల్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా చర్యలు చేపట్టారు.

పోతురాజు మృతికి టీడీపీ నేతల సంతాపం

ఇంకొల్లు,అక్టోబరు 11,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లుకు చెందిన మాటూరి పోతురాజు(55) శనివారం మృతి చెందగా టీడీపీ నేతలు సంతాపం తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఎల్ఐసీ ఏజంటుగా పని చేస్తున్నాడు. తెలుగుదేశం పార్టీ అభిమాని. పోతురాజు మృతిపట్ల టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పర్చూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగపు ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు సొసైటీ అధ్యక్షులు కరి శ్రీనివాసరావు, ఇంకొల్లు బ్రాంచ్ ఎల్ఐసీ సిబ్బంది పోతురాజు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

తల్లి కొడుకుల మధ్య వివాదం

● సద్దిచెప్పేందుకు వచ్చిన పెద్దమ్మపై దాడి

అద్దంకి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఇల్లు ఖాళీ చేయమనడంతో తల్లీ, కొడుకుల మధ్య వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో తల్లికి ఆమె అక్క సంఘీభావంగా వచ్చింది. దీంతో కొడుకు పెద్దమ్మపై దాడి చేశారు. ఈ ఘటనపై శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెం లో గుంజి ఏడుకొండలు, తల్లి అంజమ్మలు ఒకే భవనం లో రెండు అంతస్తులలో వేరు వేరుగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కొడుకు ఏడుకొండలును ఇళ్ళు ఖాళీ చేయాలని తల్లి అంజమ్మ తరచూ కోరుతుంది. ఈ క్రమంలో తల్లీ, కొడుకుల మధ్య గొడవ జరుగుతోంది. శుక్రవారం తల్లీ, కొడుకులు గొడవ పడుతుండగా అంజమ్మ అక్క మహలక్ష్మమ్మ వచ్చి చెల్లెలుకు సంఘీభావంగా మాట్లాడింది. దీంతో ఏడుకొండలు దాడి చేసినట్లు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహలక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన రాజు

సంతమాగులూరు అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఫత్తేపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. గుంటూరు జిల్లా నల్లపాడు మండలం చల్లావారిపాలేనికి చెందిన మెట్ల అయితరరాజు (39) బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో అత్తగారికి ఇంటికి స్కూటీపై వచ్చాడు. అక్కడ పిల్లలను వదిలిపెట్టి తిరిగి వెళ్లే క్రమంలో ఫతేపురం వద్ద ట్రాలీని తప్పించబోయి స్కూటీ రోడ్డు దిగడంతో స్లిప్పయి రోడ్డుపై పడ్డాడు. అదేసమయంలో వెనుకాలే వస్తున్న ఫోర్ వీల్ ఆటో ఆయన్ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ

● వ్యక్తికి తీవ్రగాయాలు

అద్దంకి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానిసెంటర్‌లో మోటార్‌సైకిల్‌ను లారీ ఢీ కొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పట్టణానికి చెందిన మహేష్ మోటార్‌సైకిల్ పై శనివారం ఉదయం దర్శి రోడ్డులో వస్తుండగా భవానిసెంటర్‌లో వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. గాయాలైన మహేష్ ను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పర్చూరు మాజీ సర్పంచ్ సరోజిని మృతి

పర్చూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మాజీ సర్పంచ్ యద్దనపూడి సరోజిని(63) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఒక్కసారిగా అస్వస్థకు గురికావడంతో హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. 2014-2019 మధ్య కాలంలో పర్చూరు గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. సరోజిని మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మద్యానికి యువత దూరంగా ఉండాలి

● అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యువతరం మద్యపానం, పొగాకు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్, బాపట్ల జిల్లా కోర్ కమిటీ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీగౌతమీ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, డీసీహెచ్ఎస్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్య క్రమాలలో పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు యద్దనపూడి, 10:30 గంటలకు కోరిశపాడు మండలం పి.గుడిపాడు, 11:30 గంటలకు అద్దంకి పట్టణంలోని 2 వ వార్డు, మధ్యహ్నం 12 గంటలకు వెంపరాలలో పర్యటించనున్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగంపై దృష్టిసారించండి

● ఘనంగా బీజేపీ ఆత్మనిర్భర్ జిల్లా కార్యశాల



కార్యశాలలో మాట్లాడుతున్న బీజేపీ నేత శివన్నారాయణ

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ ఉత్పత్తుల వినియోగంపై ప్రతిఒక్కరూ దృష్టిసారించి ఆరోగ్యకరమైన, ఆర్థిక పరిపుష్టి ఉన్న సమాజ స్థాపనకు సహకరించాలని బీజేపీ ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ జోనల్ ఇన్‌చార్జ్ బిత్రా శివన్నారాయణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు డా.అశోక్ రాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో బీజేపీ కార్యశాల జిల్లా అధ్యక్షులు కొండముది బంగారుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 25 నుండి డిసెంబర్ 25 వరకు సంకల్ప అభియాన్ కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతరిస్తున్న చేతివృత్తుల కళలను ప్రోత్సహించాలన్నారు. తద్వారా సంస్కృతి సాంప్రదాయాలు విలువలు పెరుగుతాయన్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీరాజ్యం, వరప్రసాద్, రమేష్, భరణీ, సుబ్బారావు, కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు

● రామాపురం తీరాన్ని పరిశీలించిన కలెక్టర్
● అభివృద్ధి పనులు పరిశీలన
● అధికారులకు పలు సూచనలు


సముద్రతీరం మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగం అభివృద్ధికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డా.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. రూ.2.35 కోట్లు నిధులతో జరుగుతున్న బీచ్ అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి సైతం నిత్యం తీరానికి విచ్చేస్తున్న క్రమంలో వారికి వసతుల్లో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈక్రమంలోనే రూ.40 లక్షలతో తాగునీటి పైప్‌లైన్స్, రూ.30 లక్షలతో డ్రెస్సింగ్ రూంలు, రూ.10 లక్షలతో ఓపెన్ షవర్ పాయింట్స్, రూ.30 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సు, రూ.95 లక్షలతో బయో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులకు సంబంధించి స్థితిగతులను ఆరాతీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, నీటిసరఫరా అధికారి అనంత రాజు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్‌లు గోపీకృష్ణ, గీతారాణి, ఎంపీడీవో విజయ, ఏఈ నాగరాజు సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ఆవుల డొంక

● డొంకకు రెండు వైపులా మాగాణి సాగు
● కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్న వైనం
● ఎగువ ప్రాంత రైతుల్లో ఆందోళన


మాగాణి సాగుతో కుంచించుకుపోతున్న ఆవుల డొంక

బల్లికురవ, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో పురాతన కాలం నుండి రైతులకు ఎంతో ఉపయోగపడే ఆవుల డొంకను కొందరు రైతులు పంటలు సాగు చేస్తూ ఆక్రమించుకుంటున్నారు. దీంతో డొంకకు ఎగువ భాగంలో పంట భూములు ఉన్న రైతులు ఈ డొంకలో గుండా రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో కొండ దిగువన ఉన్న ఆవుల డొంకకు ఇరు వైపులా సుమారు వంద ఎకరాలకు పైబడి పంట భూమి ఉంది. ఈ డొంకను కొందరు రైతులు రెండు వైపులా రోజు రోజుకు నరుకుతున్నారు. పంట భూముల్లో వ్యర్థాలను సైతం రోడ్డునే పడేస్తున్నారు. దీంతో నిత్యం పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


ఎగువన ఉన్న రైతులకు ఇబ్బంది కలిగేలా డొంకపై వేసిన వ్యర్థాలు

ఇటీవల ఈడొంకను గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పరిచారు. అయినప్పటికి డొంక భూమిని రైతులు ఆక్రమించుకుంటున్నారు. దిగువ భూములు ఉన్న రైతులకు ఇబ్బంది లేకపోయిన సుమారు 50 ఎకరాల పంటలు సాగు చేసే రైతులు మాత్రం ఆవుల డొంక సరిగా లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబందిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆవుల డొంకను సర్వే చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పీఎం ధనధాన్య కృషి యోజనతో రైతులకు మేలు

డీఏవో సుబ్రహ్మణ్యేశ్వరరావు


మాట్లాడుతున్న డీఏవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

పంగులూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న పీఎం ధనధాన్య కృషియోజన ద్వారా రైతు సంక్షేమానికి, ఆహారభద్రతకు భరోసా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రహ్మణేశ్వరరావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో పలు వ్యవసాయాభివృద్ధి పథకాలపై పథకాలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అద్దంకి, మార్టూరు, పర్చూరు ఏడీఏల పరిధిలోని పది మండలాల ఏవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతుల ఆదాయం పెరగడానికి, పంటల వైవిధ్యం సాధించడానికి, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ధనధాన్య కృషియోజనలో జాతీయ ప్రకృతి వ్యవసాయమిషన్, జాతీయ ఆహార వంటనూనెలు, నూనె గింజల మిషన్‌లు ఈ పథకంలో ఉన్నాయన్నారు. ఆత్మనిర్భర్ మిషన్ కాలపరిమితి 2025-26 నుండి 2030-31వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ పథకం అధిక దిగుబడులు సాధించడం పంటలను నిల్వచేయడం పర్యావరణాన్ని రక్షించడం వంటి లక్ష్యాల కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు ఏడీఏలు సుదర్శనరాజు, ప్రవీణ, టెక్నికల్ ఏవో వెంకటరామయ్య, అద్దంకి, మార్టూరు, కొరిశపాడు, పంగులూరు, పర్చూరు, ఇంకొల్లు, బల్లికురవ, యద్దనపూడి, ఏవోలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు కె.వి.సుబ్బారావు, మురకొండ సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, పెంట్యాల రామలింగ స్వామి, ఎంపీటీసీ సభ్యులు వాసవి, పీఏసీఎస్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

నిచ్చెనలు, వెదురు కర్రలతో సరి


ప్రధాన విద్యుత్ తీగలకు ఆసరాగా ఏర్పాటు చేసిన నిచ్చెన

పర్చూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు ఏళ్ల నాటి విద్యుత్ తీగలు కిందకు జారీ ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఏదో ఒక చోట విద్యుత్ తీగలు తెగి కిందపడుతున్నాయి. అదృష్టవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడిన చోట ప్రజలు లేకపోవటంతో పెనుప్రమాదం తప్పుతోంది. ఇలాంటి పరిస్థితులు మండల కేంద్రమైన పర్చూరులో తరుచూ చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఇటీవల పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ తీగ తెగి బస్సుమీద పడింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. పర్చూరు - ఇంకొల్లు రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో విద్యుత్ తీగ కిందకు జారింది. ఎదురు వెదురుతో తయారుచేసిన నిచ్చెను పెట్టి సరిపెట్టారు. అయితే పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేదు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే రహదారిలో ఇలాంటి ఏర్పాట్లు చేయడంతో ఇదిచూసిన ప్రజలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను తొలగించి, పూర్తిస్థాయిలో కొత్త విద్యుత్ వైర్లతోపాటు, నాణ్యమైన స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గడియార స్తంభం నిర్మాణంతో వైసీపీ ఆత్మగౌరవానికి భంగం

● విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నేతలు
● గతంలో ప్రతిపాదించిన ప్రదేశాలకు భిన్నంగా కార్యచరణ


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గడియారస్తంభం నిర్మించ తలపెట్టిన అంశం వైసీపీ ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉందని పలువురు వైసీపీ నేతలు అన్నారు. శనివారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు యాతం మేరీ బాబు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే గడియార స్తంభం ఏర్పాటుకు రెండు ప్రదేశాలు ప్రతిపాదించినట్లు వివరించారు. వాటిని ప్రస్తుతం పక్కన పెట్టి రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఇబ్బం దులు కలిగించేలా మార్పులు చేస్తున్నారని అభ్యంతరాలు తెలిపారు. గడియార స్తంభం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదన్నారు. స్థలం విషయంలో పునఃపరిశీలన చేయాలని లేకుంటే పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో బొనిగల జైసన్‌బాబు, బత్తుల అనీల్, చీమకుర్తి బాలకృష్ణ, కంపా అరుణ్, గవిని శ్రీను, వాసుమళ్ల వాసు, ప్రసాద్‌రెడ్డి, ప్రసన్న, రమణారెడ్డి, చిరంజీవి, రాఘవరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

ఇదే విషయమై మున్సిపల్ ఛైర్మన్‌తో రెండు రోజుల క్రితం జరిగిన చర్చల్లో స్పష్టం చేసినట్లు వారు వివరించారు. ఇదిలా ఉంటే మరోవైపు ఆమంచి వర్గీయులు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నేతలు రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఇబ్బందులు కలిగించేలా గడియారస్థంభం ఏర్పాటు చేయరాదని, వెంటనే ఆలోచన ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

గుంతలో ఇరుక్కున్న ఆర్‌టీసీ బస్సు


యనమదల గ్రామంలో గుంతలో ఇరుక్కుపోయిన ఆర్‌టీసీ బస్సు

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు11(ఆంధ్ర జ్యోతి): ఆర్‌టీసీ బస్సు రోడ్డు మధ్యలో గోతిలో ఇరుక్కుపోయిన ఘటన యద్దనపూడి మండలంలో మార్టూరు- యద్దనపూడి మధ్య యనమదల గ్రామంలో చోటు చేసుకొంది. శనివారం సాయంత్రం చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ,చీరాల నుండి మార్టూరు వస్తోంది. యనమదల సెంటరులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనదారులను భయపెడుతున్నాయి. దానికి తోడు ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు గోతులు మరింత లోతుగా ఏర్పడ్డాయి. రోజూ ఈ గోతులలో మార్టూరు నుండి పర్చూరు వైపు గ్రావెల్, కంకరతో తరలివెళ్లే భారీ వాహనాలు కారణంగా రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. గోతులలో ఆర్‌టీసీ బస్సు టైర్లు ఇరుక్కుపోవడంతో గ్రామంలోని కొంతమంది యువకులు స్వచ్ఛందంగా సాయం చేయడంతో ఆర్‌టీసీ బస్సు గుంతలు నుంచి బయటపడి యధావిధిగా చీరాలకు వెళ్లిపోయింది.

పూర్తి స్థాయిలో నిండిన వీర్లచెరువు

● పైర్ల సాగుకు రైతులు సిద్ధం


భారీ వర్షాలతో పూర్తి స్థాయిలో నిండిన వీర్ల చెరువు

బల్లికురవ, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వీర్ల చెరువు పూర్తి స్థాయిలో నిండింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఇంత పెద్దస్థాయిలో చెరువుకు నీరు చేరిందని రైతులు పేర్కొంటున్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాల్లోని పంట భూములకు ఈ చెరువు నీరు ఎంతో ఉపయెగ పడనుంది. సుమారు 350 ఎకరాల విస్తీర్ణం కలిగిన వీర్ల చెరువుకు నీరు చేరి నిండు కుండలా ఉంది. చెన్నుపల్లి గ్రామం వైపునకు చెరువు నిండి నీరు వచ్చిందని రైతులు తెలిపారు. చెరువుకు వాగుల ద్వారా నీరు బాగా రావడంతో చెరువు అలుగు కూడా పారుతోందని దీంతో దిగువ భాగంలో ఉన్న పంటలకు కూడా నీరు చేరుతుందని రైతులు తెలిపారు. బల్లికురవ గ్రామ పరిధిలోని ఎత్తిపోతల పథకం కూడా వినియోగంలోనికి రానుందని రైతులు తెలిపారు, నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన రైతులు చెరువు నీటి ద్వారా పంటలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

వాగును తలపిస్తున్న క్రీడామైదానం

● వినియోగంలోకి తీసుకురావాలని వాకర్స్ వినతి


వర్షపు నీటితో ఎన్‌ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానం

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన కుండపోత వర్షాలతో పట్టణంలోని ఎన్‌ఆర్అండ్‌పీఎం హైస్కూల్ క్రీడామైదానం వర్షపు నీళ్లతో నిండి వాగును తలపిస్తోంది. క్రీడామైదానంలో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వాకింగ్ చేస్తుంటారు. ఈసందర్భంగా శనివారం అక్కడికి చేరుకున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థులకు అన్నిరకాలుగా ప్రయోజనకరంగా ఉండే మైదానం అధ్వానంగా ఉండడంపై విచారం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలని పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, సురేష్, రవి, నారాయణరావు తదితరులు కోరారు.

ఏఐతో విప్లవాత్మక మార్పు

● సెయింట్ ఆన్స్ కళాశాలలో వర్క్‌షాపు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషియల్స్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు సంతరించుకుంటున్నట్లు వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎమోషనల్ డిటెక్షన్ యూజింగ్ ఏఐ ఎండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై నిపుణుల అభిప్రాయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు అందజేత

దేశాయిపేట(చీరాల), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వయోభారంలో వృద్ధులను గౌరవించాలని, వారిపట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు బండారుపల్లి హేమంత్‌కుమార్, నాగవీరభద్రాచారి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, ప్రసాద్, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, మల్లేశ్వరరావు, విశ్వేశ్వరరావు, హరిహరరావు, యల్లమంద తదితరులు పాల్గొన్నారు.


వెంకట్రావు కుటుంబానికి మంత్రి పరామర్శ


వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) టీడీపీ మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకట్రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శనివారం అడవిపాలెం గ్రామంలోని ఆయన నివాసానికి మంత్రి రవికుమార్ వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, చింతా రామారావు అట్లా పెద్ద వెంకటరెడ్డి, గురు యాదవ్, చిన్న గాలయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 12 అక్టోబరు 2025

సెలవులైనా క్లాసులే..!

- కొనసాగుతున్న ప్రైవేటు తరగతులు
- యథేచ్ఛగా యాజమాన్యాల నిర్వహణ
- ప్రభుత్వ ఆదేశాలు లెక్కచేయని వైనం



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

నెల్లూరు(విద్య), అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి) : సెలవుల్లో తరగతులు నిర్వహించరాదన్న ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బేఖాతరు చేస్తున్నాయి. ఆదివారం, రెండో శనివారం, పండగ సెలవులు ఏమైనా సరే తరగతులు నిర్వహిస్తామంటున్నారు వారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సెలవుల్లో సైతం తరగతులు నిర్వహించిన కార్పొరేట్ విద్యాసంస్థలు దసరా సెలవుల్లోనూ తరగతులను నిర్వహించాయి. ప్రస్తుతం రెండోశనివారం, ఆదివారం కూడా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను క్లాసుల్లో బందిస్తున్నారు.

బలవంతపు చదువులు

ఓ వైపు కుటుంబ సభ్యులు, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే వారంతా సెలవుల్లో రిలాక్స్ అవుతున్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం విద్యార్థులను యంత్రాలుగా భావించి, తరగతి గదుల్లో బలవంతపు చదువులు రుద్దుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశాయి. సెలవుల్లో తరగతులు నిర్వహించకూడదని సంబంధిత అధికారులు ఆదేశాలు చేస్తున్నా, అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రెండో శనివారం సెలవు అయినా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారు శనివారం పలు విద్యాసంస్థల్లో తరగతులను అడ్డుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వీ.నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తూ, సెలవుల్లో కూడా చదువుల పేరుతో వేధించే సంస్థలపై విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు వంశీ, విష్ణు, చరణ్, యశ్వంత్, తాహిర్, అక్రమ్, ముజాహిల్, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 12,764 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 12,764 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.929 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

బీపీసీఎల్‌కి భూకేటాయింపులు

- ఆరువేల ఎకరాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇప్పటికే 2,500 ఎకరాలకుపైగా సేకరణ

కందుకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్)కి రామాయపట్నం పోర్టుకు సమీపాన ఆరువేల ఎకరాల భూములు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. చేవూరు, గుడ్లూరు మండలం రావూరు, కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం గ్రామాల పరిధిలో ఈ భూములు సేకరించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. తొలుత ఆనెమడుగు గ్రామాన్ని కూడా భూసేకరణలో చేర్చినా, ఇటు కావలికి, అటు జాతీయ రహదారికి ఆ గ్రామం భూములు అతిసమీపంలో ఉండటంతో రూ.కోట్లు విలువజేసే భూములను తక్కువధరకు అమ్ముకోలేమని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో ఆ గ్రామాన్ని భూసేకరణ నుంచి మినహాయించినట్లు తెలిసింది. అవసరమైతే రుద్రకోట గ్రామపరిధిలో కూడా భూములను బీపీసీఎల్ కోసం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

● డిసెంబరులో డీపీఆర్.. వేలాది మందికి ఉపాధి

చేవూరు, చెన్నాయపాలెం గ్రామాల్లో భూసేకరణ వేగవంతంగా జరుగుతోంది. ఈ గ్రామాల పరిధిలో ఇప్పటికే 2,500 ఎకరాలకుపైగా భూసేకరణ పూర్తయినట్లు సమాచారం. మరో రెండు నెలల్లో మొత్తం 6వేల ఎకరాల సేకరణ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. డిసెంబరులోగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సమర్పించేందుకు కూడా కంపెనీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా, బీపీసీఎల్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ పార్కు రూ.1.03 లక్షల కోట్లతో ఏర్పాటు కానున్నది. ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురును శుద్ధిచేసే కెపాసిటీతో ఈ కంపెనీ నిర్మాణం పూర్తికానున్నది. తద్వారా 3,750 మందికి ప్రత్యక్షంగానూ, మరో 10వేల మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు.

● రెండువేల ఎకరాల్లో పచ్చదనం

గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ అయినందున కేటాయించిన ఆరు వేల ఎకరాల్లో 33.3 శాతం అంటే రెండువేల ఎకరాల్లో పచ్చదనాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. పర్యావరణానికి ఎలాంటి ముప్పురాకుండా పచ్చదనాన్ని నిరంతరం పరిరక్షించాల్సిన బాధ్యత బీపీసీఎల్‌దే. ఈ రిఫైనరీకి 600 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా వేస్తుండగా, ప్రస్తుతం చేవూరు వద్ద ఏర్పాటవుతున్న ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా 100 మెగావాట్లు సరఫరా అవుతుందని, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్ నుంచి తీసుకోవాలని చెబుతున్నారు.

● ప్రజల భయాందోళన

ఈ రిఫైనరీ ఏర్పాటుతో పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న భయాందోళన స్థానికుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ప్రారంభమయ్యేలోగా ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించాల్సి ఉంది. డీపీఆర్ సిద్ధమైన వెంటనే ఈ ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎస్ఎఫ్‌సీ ఈడీగా ప్రసాద్

పరిశ్రమలశాఖ జీఎంకు పదోన్నతి



నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్‌సీఎం ప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది కాలంగా పరిశ్రమలశాఖ జీఎంగా పనిచేస్తున్న ప్రసాద్ ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) ఈడీగా విజయవాడకు వెళ్లనున్నారు. ఆయన వారంలో బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే జిల్లా పరిశ్రమలశాఖ జీఎంగా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

ముందే దీపావళి!

- నెల్లూరు నగరంలో స్మార్ట్ స్ట్రీట్ బజారు ప్రారంభం
- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- లబ్ధిదారులతో మాటామంతి
- మీ కళ్లల్లో ఆనందం కనిపిస్తోందంటూ హర్షం
- మంత్రి నారాయణకు అభినందన



> అందరికంటే ముందు నెల్లూరు నగరానికి దీపావళి పండుగ వచ్చింది... ఆ సంబరం మహిళల కళ్లల్లో కనిపిస్తోంది.
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



స్మార్ట్ స్ట్రీట్ బజారును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆవిష్కరించిన శిలాఫలకం, సభలో చంద్రబాబుకు దుకాణాల కేటాయింపు పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 11,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని మైపాడు రోడ్డు సెంటర్‌లో సుమారు రూ. 8 కోట్లతో నిర్మించిన 120 దుకాణాల స్మార్ట్ స్ట్రీట్ బజారును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మార్ట్ బజారులో దుకాణాలు పొందిన లబ్ధిదారులను ఆయన పేరుపేరున పలకరిస్తూ వ్యాపార అనుభవాలు, తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో స్మార్ట్ బజారును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ వ్యాపారులను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని అన్నీ పట్టణ, నగరాల్లో మహిళలు ముందుకు వస్తారని తెలిపారు. సోలార్, వైఫై, కంటైనర్లు, మరుగుదొడ్లతో కూడిన వసతులున్న స్మార్ట్ బజారును చూస్తుంటే ముచ్చటేస్తుందని సీఎం కొనియాడారు. అందరూ కష్టపడి పని చేసి మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ స్మార్ట్ బజారును చూస్తుంటే లండన్, ప్యారీస్‌లను చూస్తున్నంటుందని కొనియాడారు. అన్నీ రకాల దుకాణాలు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.

● అభివృద్ధికి చాలా వనరులున్నాయి...

నెల్లూరు జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని, అందుకు అనుకూలంగా చాలా వనరులు ఉన్నాయని సీఎం తెలిపారు. సముద్ర తీరానికి అనుకుని పోర్టులు ఏర్పడటం, జాతీయ రహదారి ఉండటం, త్వరలో విమానాశ్రయం కూడా రావడం, చెన్నై నుంచి అమరావతికి బులెట్ ట్రైన్ సౌకర్యం కూడా పరిశీలనలో ఉండటం వంటి వనరులు జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మంత్రి నారాయణ, కలెక్టర్‌లు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఏఎండీ వెంకటకృష్ణ, కమిషనర్ నందన్, మెప్మా పీడీ లీలారాణి, టీడీపీ నేత తాళ్లపాక అనురాధ, జనసేన నేత నూనె మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● మంత్రి నారాయణకి సీఎం అభినందనలు

రాష్ట్రంలో మరెక్కడ లేని విధంగా నెల్లూరులో ప్రత్యేకించి ప్రయోగాత్మకంగా స్మార్ట్ స్ట్రీట్ బజారు ఏర్పాటు చేసిన మంత్రి నారాయణను సీఎం చంద్రబాబు ప్రత్యేకించి అభినందించారు. ఇలాగే అన్నీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ త్వరలో ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి నారాయణతో పాటు కలెక్టర్, కమిషనర్, మెప్మా అధికారులను అభినందిస్తున్నట్లు సీఎం తెలిపారు.

మీరు జీనియస్ సర్.. : కలెక్టర్

సర్..! మీరు నిజంగా గొప్పవ్యక్తి. మేమంతా స్మార్ట్ బజారులో దుకాణాలు పొందిన లబ్ధిదారుల్లో కొందరిని ఎంపిక చేసుకుని మీతో ఎలా మాట్లాడాలని శిక్షణ ఇచ్చి ఉంచాం. కానీ మీరు వారితో మాట్లాడకుండా మరొకరితో మాట్లాడి వాస్తవాలు బయటకు లాగారు. నిజంగా మీరు గొప్ప వ్యక్తి ... అంటూ కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంతో అన్నారు. స్పందించిన సీఎం మీరు సిద్ధం చేసినవారితో మాట్లాడితే నాకు నిజాలు ఎలా తెలుస్తాయి....? ఎవరితో ఎలా మాట్లాడాలో నాకు తెలుసుగా... అనడంతో అందరిలో నవ్వులు విరిశాయి.

నా నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం సంతోషం : వీపీఆర్

ఇంత మంచి ప్రాజెక్టును నా పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఆయనకూడా వర్చువల్‌గా పాల్గొన్నారు. చంద్రబాబు ఆశీస్సులు మనందరిపై ఉండాలని, మనందరి ఆశీస్సులు కూటమి సర్కారుకు ఉండాలని ఆయన పేర్కొన్నారు.



సభలో మంత్రి నారాయణతో కలెక్టర్ హిమాన్షు శుక్లా, కమిషనర్ నందన్



కేకు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మంత్రి నారాయణ తదితరులు



నేను వ్యాపారినయ్యా..

స్మార్ట్ బజారు ఏర్పాటు చేయడం వల్ల నేను వ్యాపారినయ్యా..! నాకు ఓ షాపుంది. నా కాళ్ల మీద నేను నిలబడి జీవించడానికి ఈ షాపు ఎంతగానో దోహదపడుతుంది.

\- సంగీత



చాలా సంతోషంగా ఉంది

మాకు సొంతంగా షాపు ఉందంటే చాలా సంతోషంగా ఉంది. ఊహించుకుంటేనే ఆనందం కలుగుతోంది. పండ్ల వ్యాపారంతో గౌరవంగా జీవించవచ్చు. మంత్రి నారాయణకు రుణపడి ఉంటాం.

\- జ్యోతి



బుట్టల వ్యాపారం పెట్టుకున్నా..

బుట్టల వ్యాపారమంటే ఇప్పటి వరకు సుబేదార్ పేట వద్దనే ఉండేవి. ఇప్పుడు స్మార్ట్ బజారులో నాకిచ్చిన షాపులో బుట్టలు అమ్మే దుకాణం ఏర్పాటు చేసుకున్నా. చాలా వరకు దిగులు తగ్గింది.

\- సిరిగిరి లక్ష్మి



1గ్రామ్ గోల్డ్ నగల వ్యాపారం

గ్రాము బంగారంతో తయారు చేసిన ఆభరణాలు, ఇతర గిల్ట్ నగల దుకాణం పెట్టుకున్నా. స్మార్ట్ బజారులో దుకాణం కేటాయించడం చాలా సంతోషంగా వేసింది. ఇక్కడ అన్నీ సౌకర్యాలు ఉన్నాయి.

\- జీ నాగలక్ష్మి



చెప్పలేని ఆనందం

స్మార్ట్ బజారులో నాకు ఓ దుకాణం కేటాయించారు. అందులో నేను త్రీడీ డిజైన్‌తో ఫ్రేమ్స్ తయారీ షాపు పెట్టుకున్నా. నాకు నిజంగా చెప్పలేనంత ఆనందం వేస్తోంది.

\- మెహరాజ్

పేదల ఇళ్ల మాటున జరిగిన భారీ కుంభకోణంలో పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు సరే.. మరి సూత్రధారులైన కాంట్రాక్టర్ల మాటేమిటి..? పేదల సొమ్మును దోచుకున్న వీరి నుంచి రికవరీ చేయరా..? నాసిరకంగా బేస్‌మట్టాలు కట్టి రూ.కోట్లు దోచుకున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోరా..? పేదల ఇళ్లను బాగు చేయరా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో జరిగిన హౌసింగ్ స్కాం ఇప్పుడు బద్దలవుతోంది. ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న వ్యవహారాలను చూసి సామాన్యులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోతున్నారు. నాడు అనేక ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇదే అలుసుగా కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు కుమ్మక్కై రూ.వందల కోట్లను దోచుకున్నారు.

వారు సరే... వీరి మాటేమిటీ?

- ఇప్పటికే హౌసింగ్ అధికారులపై చర్యలు
- పేదల సొమ్ము మింగిన కాంట్రాక్టర్లపై చర్యలేవి?
- ప్రతీ గోదాములో సిమెంటు, స్టీలు, ఇసుక మాయం

నెల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఇళ్లు కట్టకుండానే కట్టినట్లు చూపించి తీసుకున్న బిల్లులు రూ.110 కోట్లు ఉన్నట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇక కట్టిన ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తే మరో రూ.వంద కోట్ల కుంభకోణం బయటపడుతుందన్నది అంచనా. ఈ పరిస్థితుల్లో నాటి అక్రమాలకు బాధ్యులుగా హౌసింగ్ అధికారులపై ఇప్పుడు వరుసపెట్టి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ పది మంది వరకు హౌసింగ్ అధికారులు సస్పెన్షన్‌కు గురవ్వగా, మరికొంత మందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఒక పక్క తప్పు జరిగిందని, ప్రజాధనం పక్కదారి పట్టిందని నిర్ధారించిన హౌసింగ్ శాఖ.. ఈ సొమ్మును నేరుగా జేబుల్లో వేసుకున్న కాంట్రాక్టర్లపై మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికి ఒక్క కాంట్రాక్టర్ నుంచి కూడా రికవరీ చేయడం గానీ, చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు.

● వెలుగులోకి అక్రమాలు

జిల్లాలో నిర్మించిన ఇళ్లకు పంపిణీ చేసిన మెటీరియల్‌కు, చెల్లించిన బిల్లులకు పొంతన కుదరడం లేదు. స్టేజి కన్వర్షన్ చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు లాగేసుకున్నారు. నాసిరకంగా బేస్‌మెంట్లు నిర్మించి ఆ దామాషా బిల్లులతోపాటు సిమెంటు, స్టీలు, ఇసుకను స్వాహా చేశారు. ఇటీవల గోదాముల్లో ఉన్న నిల్వలపై హౌసింగ్ అధికారులు తనిఖీలు చేపట్టగా చాలా తేడాలు బయటపడ్డాయి. కొండ్లపూడి గోదాములో సుమారు 6 వేల బస్తాల సిమెంటు, 27 టన్నుల స్టీలు, 2500 టన్నుల ఇసుక తేడా వచ్చింది. వెంకటేశ్వరపురం గోదాములో 25 టన్నుల వరకూ స్టీలు పక్కదారి పట్టినట్టు తేలగా, పొదలకూరులో ఐదు టన్నుల స్టీలు, 800 బస్తాల సిమెంటు తేడా వచ్చినట్లు తెలుస్తోంది. మనుబోలులో అయితే ఏకంగా వెయ్యి టన్నుల ఇసుకతోపాటు 20 టన్నుల స్టీలు లెక్క తేలడం లేదు. కావలిలో కూడా సుమారు 6 వేల బస్తాల సిమెంటు, 27 టన్నుల వరకూ స్టీలు లెక్కల్లోకి రావడం లేదని తెలుస్తోంది. సంగంలో 30 టన్నుల స్టీలు, 3 వేల బస్తాల సిమెంటు తేడా రాగా, దుత్తలూరులో 22 టన్నుల స్టీలు తేడా వచ్చినట్లు హౌసింగ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరికొన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇదంతా ఎక్కడికి వెళ్లిందన్న దానిపై లోతుగా విచారణ చేయాల్సి ఉంది.

నెల్లూరులో అసంపూర్తిగా ఉన్న జగనన్న ఇళ్లు



● పేదల సొమ్ముతో వ్యాపారాలు

గత ప్రభుత్వంలో లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను ఆప్షన్-3 పేరుతో వందలమంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా ఆరు అంకణాల స్థలంలో బేస్ స్థాయి నిర్మాణానికి రూ.30 వేలకు మించి ఖర్చు కాదు. అయితే ఈ బీఎల్ స్థాయి నిర్మాణం జరిగితే తొలుత రూ.50 వేలు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. ఆ తర్వాత దాన్ని రూ.70 వేలకు పెంచారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు కొట్టేశారు. బేస్ స్థాయికే ఇంత పెద్ద మొత్తం చెల్లించేలా నాడు హౌసింగ్ శాఖ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంట్రాక్టర్లు ఉన్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేయగా, అందులో 36 వేలకుపైగా ఇళ్లు నాట్ స్టార్టెట్ నుంచి బేస్ లెవల్ స్థాయిలోనే ఉన్నాయి. ఇందులో 15 వేలకుపైగా ఇళ్లకు రూ.50 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్క నెల్లూరు జిల్లాలో పేదల ఇళ్ల పేరుతో ఇప్పటి వరకూ సుమారు రూ.900 కోట్ల వరకూ మెటీరియల్, బిల్లులు చెల్లించారు. అందులో ఒక కాంట్రాక్టర్‌కే రూ.200 కోట్లు వరకూ అందినట్లు సమాచారం. అయితే ఈ కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇళ్లు పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. పేదల సొమ్ముతో ఇతర వ్యాపారాలు చేసుకుంటూ దర్జాగా తిరుగుతున్నారు. జిల్లా స్థాయిలో కొందరు అధికారులు వీరికి నోటీసులు ఇస్తున్నప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామంలో ఓ ఇంటి పిట్టగోడపై పిడుగుపడి ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కామినేని పుల్లమ్మ ఇంటి పిట్ట గోడపై పిడుగు పడింది. దీంతో పుల్లమ్మ ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితురాలు వాపోయింది. అయితే అదృష్టవశాత్తు ఇంటిలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల పంచాయతీలోని రాళ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్లపల్లి వెంకటేశ్వర్లు మనవరాలు వివాహ వేడుకల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండ్లి కుమార్తె ఉమామహేశ్వరిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాలేపాటి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

కావలి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు త్వరగా కోలుకోవాలని కమ్మ సంఘం నాయకులు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం కావలి పెద్ద చెరువులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. మాలేపాటికి గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావటంతో అమరావతిలోని మణిపాల్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాలేపాటి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కమ్మసంఘం అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఆకాంక్షించారు.

వెల్లటూరివారిపాలెంలో పోషకాహార మాసోత్సవాలు

కొండాపురం, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. సచివాలయ ఎమ్ఎల్‌హెచ్‌పీ మార్గరెట్ బాలికా సంరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలద్వారా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని గర్భిణిలు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కే శివకుమారి, ఎం శ్రీదేవి, ఎస్ మమత, కే వరలక్ష్మి, రమణమ్మ, విజయలక్ష్మి, గోపీచందన, వరమ్మ, సుల్తానమ్మ, ఆశా కార్యకర్తలు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించి, గోతులు పూడ్చి...

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో పంటపొలాలకు వెళ్లే మార్గం ఇరువైపులా ముళ్ళచెట్లు ఏపుగా పెరిగాయి. రోడ్డుపై గోతుల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు రైతు రామోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో స్పందించిన ఆయన సొంత నిధులతో కిలో మీటరు మేర పెరిగిన ముళ్ళచెట్లను తొలగించడంతో పాటు గోతులను పూడ్చించడంతో గ్రామస్తులు రామోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పదివేల సంతకాలు చేయిస్తాం..

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదువేల సంతకాలను సేకరణను నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. పదివేల సంతకాలను సేకరిస్తామని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు తెలిపారు. బోగోలు వైసీపీ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అవమానించిన వారిని అరెస్టు చేయాలి'

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పేడ, గ్రీస్ పూసి అవమానించినవారిని వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోచి పాతల వెంకటేశ్వర్లు ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ నెల 13న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే భారీ నిరసన కార్యక్రమానికి మాదిగలు అధికసంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు వై జయరాజు, ఏ ఏసు మాదిగ, అంధ్ర బుద్దయ్య, అంకయ్య, ఏ నవీన్ కుమార్, బీ ఫిలిప్, క్రిష్ణయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలు, ఆర్థిక మోసగాళ్లపై అవగాహన కల్పిస్తున్న సీఐ అన్వర్‌బాషా, టౌన్ ఎస్ఐ శివనాగరాజు తదితరులు

కందుకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఆర్థిక నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సీఐ అన్వర్‌బాషా సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని కోటారెడ్డి ఆసుపత్రి సెంటర్‌లో ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలు, ఆర్థిక మోసగాళ్లపై అవగాహన కల్పించారు. ఆర్థిక నేరగాళ్లు ఏవిధంగా ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తారో సోదాహరణంగా వివరించటంతో పాటు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సమయాల్లో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబరు 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శివనాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు హక్కుల గురించి తెలుసుకోవాలి



లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి, తదితరులు

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఐసిడిఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ ఏవి రాధాదేవి సూచించారు. శనివారం లింగసముద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలు, విద్యాహక్కు, పోషకాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సీహెచ్ రమాదేవి, సీహెచ్ ప్రభావతి, బి బుజ్జమ్మ, ఆయా కుమారి, ఆశా వర్కర్ సీహెచ్ కోటమ్మ, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ కన్వీనర్ ఓంకారం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఓంకారం

కొండాపురం, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మండల టీడీపీ మాజీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం శనివారం ఆమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలతో పాటు, కొండాపురంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం తెలిపారని ఓంకారం తెలిపారు.

మాలేపాటికి పలువురి నేతల పరామర్శ



మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

కావలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురై శస్త్ర చికిత్స చేయించుకుని తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడిని శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారా లోకేష్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అన్నదమ్ములపై దాడి

కావలి రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పాత గొడవలు మనసులో పెట్టుకుని తమపై స్నేహితులు కర్రతో దాడి చేశారని పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన అన్నదమ్ములు సాయిక్రిష్ణ, తేజ శనివారం ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, సాయిక్రిష్ణ, తేజ పట్టణంలోని సింగ్ స్వీట్ స్టాల్‌లో పనిచేస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున టీచర్స్ కాలనీ సమీపంలో సాయిక్రిష్ణ, తేజ టీ తాగుతుండగా ముసునూరుకు చెందిన చీమల అవినాష్, పవన్‌కుమార్, రవితేజ, సుధీర్ కుమార్ కర్రతో దాడి చేస్తూ కులం పేరు తో దూషించారు.

సీజేఐపై దాడిని ఖండించిన దళిత సంఘాలు

కావలి (టౌన్) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తు దళిత సంఘాలు శనివారం ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నేతలు నిరసన తెలిపారు. మతోన్మాదులు రాజ్యాంగాన్ని తమ చేతుల్లో తీసుకుంటున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు కార్యక్రమంలో ఎల్లంటి వెంకటేశ్వర్లు, మేడికొండ సుకుమార్, గంధం ప్రసన్న, నారాయణ, జ్యోతి బాలు, ఆనంద్, పుల్లయ్య, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్‌గా కలికి శ్రీహరిరెడ్డి

కావలి, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్‌గా కావలికి చెందిన కలికి శ్రీహరిరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. క్యాన్సర్ ఆసుపత్రిలో జరిగిన క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహణ కమిటీ, దాతల సమావేశంలో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్లుగా యాలమూరి రంగారావు (రంగయ్యనాయుడు)తో పాటు కలికి శ్రీహరి రెడ్డిని నియమించారు.

ఆకుల మాలకొండయ్య మృతి టీడీపీకి తీరనిలోటు

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల మాలకొండయ్య (71) మృతి పార్టీకి తీరని లోటని మండల మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు తెలిపారు. రామానుజపురానికి చెందిన మాలకొండయ్య కొంతకాలంగా అనారోగ్యంతో శనివారం మరణించాడు. విషయం తెలుసుకున్న కొమ్మి గ్రామ, మండల టీడీపీ నాయకులు పార్టీకి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కొండాపురం, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గేదె మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని భీమవరప్పాడులో చోటుచేసుకుంది. గుది వెంకయ్య గేదెలను ఆరుబయట కట్టివేయగా, వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పిడుగు పడడంతో ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రూ1.20 లక్షల ఖరీదు చేస్తుందని బాధితుడు వెంకయ్య వాపోయాడు. సాయిపేట పశువైద్యాధికారి మధు గ్రామానికి వచ్చి గేదె మృతదేహాన్ని పరిశీలించి పంచనామా చేయించారు. ప్రభుత్వం నుండి పరిహారం అందేలా చూస్తానని బాధిత రైతుకు హామీ ఇచ్చారు.

చెకుముకి గోడ పత్రికల ఆవిష్కరణ

కావలి (టౌన్) (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేవీవీ కార్యాలయంలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు చెకుముకి సైన్స్ పోటీలు దోహదపడతాయన్నారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్టోబరు 18న మండల, పట్టణ స్థాయి, నవంబరు 1న జిల్లా స్థాయి, నవంబరు 23న రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీలలో చెకుముకి టాలెంట్ టెస్టులు జరుగుతాయన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు.

నవంబరు 2న అంధుల సమాఖ్య సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల సమాఖ్య జిల్లా యూనిట్ సర్వసభ్య సమావేశం నవంబరు 2న జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు షేక్ నాగార్జున, ప్రధాన కార్యదర్శి మోపూరు రామసుబ్బయ్య తెలిపారు. శనివారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోటీ చేయదలచిన వారు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించాలని కోరారు. 21 సాయంత్రం వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉంటుందని చెప్పారు. ప్రతీ అభ్యర్థిని ముగ్గురు సభ్యులు ప్రతిపాదించాలని తెలిపారు.

బాస్కెట్ బాల్ ఛాంపియన్ జేబీ

వీఎస్‌యూ మహిళల అంతర్ కళాశాలల క్రీడలు

కావలి (టౌన్) అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూని వర్శిటీ మహిళల అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ ఛాంపియన్లుగా కావలి జేబీ జట్టు నిలిచింది. కావలి పట్టణ వీఎస్‌యు పీజీ కళాశాల నిర్వహణలో వీఎస్‌యు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు ఆధ్వర్యంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన పోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ పోటీల్లో వీఎస్‌యూ పరిధిలోని 13 కళాశాలలనుంచి 220 మంది మహి ళా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను వర్శిటీ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జేబీలోని డీఆర్ ఇండోర్ క్రీడాప్రాంగ ణంలో రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన బాస్కెట్ బాల్ ఫైనల్స్‌లో కావలికి చెందిన జేబీ డిగ్రీ కళాశాల జట్టు నెల్లూరు అలెక్సా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టుపై 10-2 స్కోర్ తేడాతో విజయం సాధించి విన్నర్స్‌గా నిలిచింది. అలెక్సా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ముఖ్య అతిధిగా జేబీ విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని ఫైనల్ పోటీలను ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీజీ కళాశాల పీడీ మణికంఠ వ్యవహరించగా, అబ్జర్వర్‌గా డాక్టర్ విజయ కళ వ్యవహరించారు. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి, నెల్లూరు బీఈడీ కళాశాల పీడీ రవీంద్రబాబు, వీఎస్‌యూ పీడీ ప్రవీణ్‌లు సహకారం అందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి అక్రమంగా బాణాసంచా తయారీ, విక్రయాలు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసి ఇందుకూరుపేట పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసులు, విడవలూరు పోలీసు స్టేషన్ పరిధిలో, కందుకూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్కో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో బాణాసంచా తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతీ ఒక్కరు మొక్క నాటండి

- హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(లీగల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుపోలియో జడ్జి కే శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారులకు జరిగిన ఒక్కరోజు శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో హైకోర్టు జడ్జి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలత జిల్లా కోర్టు ప్రాంగణానికి వచ్చిన జడ్జికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జే శ్రీనివాస్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేద మంత్రాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ జడ్జీలు జీ ప్రవీణ్‌కుమార్, జీ.సీతాపతి పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

- మనుబోలు స్టేషన్ ప్రశాంతంగా ఉంది
- గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠీ



మనుబోలు ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠీ

మనుబోలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 'మనుబోలు స్టేషన్ పరిధిలో ఎక్కువ శాతం జాతీయరహదారి ఉంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోండి' అని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం ఐజీ త్రిపాఠీ తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఉదయం 8 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 19 గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. ఎలాంటి నేరాలు జరిగినా గుర్తుపట్టేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. హైవేపై క్రాసింగ్‌లు ఉన్న చోట పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హైవే అధికారులు, పోలీసులు కలిసి క్రాసింగ్‌ల వద్ద బ్రిక్లింగ్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫలితంగా వాహనవారులకు దూరంనుంచే క్రాసింగ్ ఉందన్న విషయం తెలుస్తుందని, తద్వారా వేగం తగ్గించి వెళతారన్నారు. దీపావళికి దుకాణదారులు ప్రమాదాలు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరూ టపాసులు విక్రయించరాదని, సిబ్బంది దీనిపై అవగాహన కల్పించాలన్నారు. మనుబోలు పోలీస్‌స్టేషన్ చాలా ప్రశాంతంగా ఉందని ఐజీ సిబ్బందికి కితాబిచ్చారు. అనంతరం అక్కడినుండి ఆయన తిరుపతికి బయలుదేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ. శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ. శివరాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎం జాతీయ అప్రంటీస్ షిప్ మేళా

నెల్లూరు(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి జాతీయ అప్రంటిస్ షిప్ మేళాను ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలైన కోల్గెట్, హామిల్టన్, శ్రీసిటీ, బ్లూస్టార్ శ్రీసిటీ, అశోక్‌లేలాండ్, జేసీబీ, గోల్డ్ ఫీల్డ్, భారత్‌ఫోర్డ్, టాటామోటర్స్, భార్గవి ఆటోమొబైల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో అభ్యర్థులం దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మేళాలో ఉద్యోగావకాశాలు పొందాలని తెలిపారు.

ఏపీసీబీఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన ఏపీసీబీఈఏ జిల్లా కార్యవర్గం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీబీఈఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం నగరంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఏపీసీబీఈఏ రాష్ట్ర నాయకులు జే.వెంకటేశ్వరరాజు, బీ మహేష్, ఎస్‌కే మీర్ ఖాశీంవలి, కే కుమార్‌పాల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా డీ.సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ హరిబాబు, కోశాధికారిగా జే.గుర్నాథం, సంయుక్త కార్యదర్శిగా ఐ సత్యవతి, సలహాదారులుగా ఏ ఫణీంద్రబాబు, ఎస్‌కే గౌస్‌బాషా, టీ.బాబు, పీ శివ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పీ శూలవతి. సహాయ కార్యదర్శిగా ఎస్‌కే షాజిద్, కార్యదర్శిగా ఎస్‌కే ఇబ్రహీం ఖలీల్, మహిళా కార్యదర్శిగా వీ గాయత్రి, డైరెక్టర్లుగా రఘురామయ్య, చెంగయ్య, ఎస్.కృష్ణయ్య తదితరులు ఎన్నికయ్యారు.

కీళ్ల వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు!

కీళ్ల వ్యాధులపై నిర్లక్ష్యం వద్దంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మనిషి కదల్లేని స్థితి వస్తుంది. తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కీళ్లకు పోషణ తక్కువ కావడం, అధిక బరువుతో కీళ్లపై ఒత్తిడి పెరగడంతో కీళ్ల వ్యాధుల (ఆర్థరైటిస్) బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతీ ఏటా అక్టోబరు 12న (నేడు) ప్రపంచ ఆర్థరైటీస్ డేను జరుపుకోవాలని తీర్మానించింది. ఈ సందర్భంగా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.



- వ్యాధి ముదిరితే కదల్లేని స్థితి
- జిల్లాలో 2.15 లక్షలమంది వ్యాధిగ్రస్థులు
- ఆధునిక విధానాలతో వైద్యచికిత్సలు
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 60 ఏళ్ల పైబడినవారికి వచ్చే కీళ్ల వ్యాధులు, నేడు యువతను సైతం పట్టి పీడిస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాధిపై అవగాహన లేకపోవడంతో కీళ్ల వ్యాధులు ప్రబలుతున్నాయి కీళ్ల జాయింట్‌లు అరిగిపోవడం, జాయింట్ వద్ద మెత్తటి ఎముకల(మృదులాస్థి) దెబ్బతినడం వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. జిల్లాలోనే 2.15 లక్షల మంది కీళ్ల వాపు వ్యాధులతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధిపై అప్రమత్తంగా లేకపోతే ముందు ముందు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్కోసారి కదల్లేక మంచానికే పరిమితం కావాల్సి వస్తుంది.

● వ్యాధిగ్రస్థులను పరిశీలిస్తే ...

జిల్లాలో కీళ్ల వ్యాధిగ్రస్తులు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నారు. నెల్లూరులోని జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగానికి ప్రతి రోజూ 100 మంది రోగులు వస్తుండగా, ఇందులో 40మంది కీళ్ల వ్యాధిగ్రస్తులే. ఇక ప్రైవేట్ ఆసుపత్రిలో కూడా ఇదే పరిస్థితి. దీన్ని బట్టి కీళ్లవ్యాధిగ్రస్థులు ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండటం, డెంగ్యూ వ్యాధి బాధిస్తుండటంతో వీరిలో ఎక్కువ మంది కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. ఇదిలా ఉంటే కృత్రిమ కీళ్లమార్పిడిలో కూడా జిల్లాలోని పలు ఆసుపత్రులు గుర్తింపును తెచ్చుకున్నాయి. జిల్లాలో ప్రతి నెలా 60 నుంచి 100 వరకు కీళ్ల మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి.

● నివారణకు ఆధునిక వైద్యవిధానాలు

కీళ్ల అరుగుదల వల్ల వచ్చే కీళ్లవాపు, వ్యాధులకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. నాలుగు దశల్లో ఈ వ్యాధికి చికిత్సలు అందిస్తున్నారు. మొదటి దశలో వైద్యుడి సంప్రదించి పెయిన్ కిల్లర్స్ వాడడం, ఫిజియోథెరపీ చేయించుకోవడం, రెండో దశలో కీళ్లలో జిగురు కోసం మందులు వాడటం, మూడవ దశలో ఆర్థోస్కోపీ ద్వారా లోపల జాయింట్‌లు శుభ్రపరచడం చేస్తారు. నాల్గవ దశలో కీళ్ల మార్పిడి(టోటల్ జాయింట్ రీప్లేస్‌మెంట్) చేస్తారు. కీళ్ల వ్యాధులు ఒక సారి వస్తే దీర్ఘకాలం పాటు మందులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు



కీళ్లవ్యాధులకు సంబంధించి నేడు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. పురుషుల్లో కంటే స్త్రీలలోనే ఎక్కువగా కీళ్ల వ్యాధులు వస్తున్నాయి. ఊబ కాయం, పోషకాహారలోపం, కాల్షియం లోపం, నిద్రలేమి, ఒత్తిడి, డిప్రెషన్ వంటి కారణాల వల్ల కూడా ఈ వ్యాధులు వస్తుంటాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా సోరియాటిక్, సెప్టిక్ వంటి వాటివల్ల కీళ్ల వ్యాధులు వస్తుంటాయి. రక్తంలోని ప్లాస్మాను తీసి కీళ్ల జాయింట్‌లో ఎక్కించటం ద్వారా కీళ్ల వ్యాధులను నివారించవచ్చు. కృత్రిమ కీళ్లు 20 నుంచి 30 ఏళ్లపాటు ఉపయోగపడేలా వీటిని రూపొందిస్తున్నారు.

- డాక్టర్ మస్తాన్‌బాషా, కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు, జీజీహెచ్

నిర్లక్ష్యం చేస్తే వైకల్యమే...



వాక్‌థాన్‌లో అపోలో వైద్యులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థరైటిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే శారీరక వైకల్యం తప్పదని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా శనివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆరో నగర సీఐ సాంబశివరావు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో వైద్యులు మాట్లాడుతూ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని తక్కువ ఫీజుతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ విక్రమ్ రెడ్డి, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరు జలాశయం నీటి నిల్వ 59.50 టీఎంసీలు

రాపూరు, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.55 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 3400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో, హెడ్ రెగ్యులేటర్ నుండి 2150 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని అధికారులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య


కలువాయి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం కలువాయి మండలం అగ్రహారంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అగ్రహారానికి చెందిన వింజం కొండయ్య (75) రత్నమ్మ (70) దంపతులు. వీరికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలు అయిపోయాయి. బ్రహ్మనాయుడు, రామానాయుడు అనే ఇద్దరు కుమారులు వ్యాపార నిమిత్తం నెల్లూరులో ఉంటున్నారు. స్వగ్రామంలో ఉంటున్న మూడవ కుమారుడు నిరంజన్‌తో కలసి కొండయ్య దంపతులు ఉంటున్నారు. నిరంజన్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి 60 గొర్రెలు ఉన్నాయి. వాటిలో సగం గొర్రెలు తనకు పంచి ఇవ్వాలని కొండయ్య దంపతులు కుమారుడు నిరంజన్‌ను అడుగుతున్నారు. శనివారం కూడా గొర్రెలు పంచి ఇవ్వాలని కుమారుడిని అడిగారు. తరువాత చూద్దాంలే అంటూ నిరంజన్ గొర్రెలు మేపుకునేందుకు పొలం వెళ్లాడు. ఈనేపథ్యంలో సాయంత్రం గ్రామానికి సమీపంలోని సోమశిల దక్షిణ కాలువ గట్టున ఉన్న పొలంలో కొండయ్య, రత్నమ్మ దంపతులు చనిపోయి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించి కుమారుడికి సమాచారం ఇచ్చారు. నోటి నుంచి నురుగు వస్తుండటంతో గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి ఎస్‌ఐ కోటయ్య వివరాలు సేకరిస్తున్నారు. దంపతుల ఆత్మహత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

కావలి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జిల్లా కరువది నుండి జిల్లాలోని బిట్రగుంటకు మోటారు బైకుపై విధులకు హాజ రయ్యేందుకు వెళుతుండగా కావలి మండలం రుద్రకోట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రైల్వే ఉద్యోగి బొనిగల సూర్యనారాయణ (36) శనివారం మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, గూడ్స్ రైలు గార్డుగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ మోటారు బైకుపై బిట్రగుంటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తెట్టు వద్ద గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనటంతో ఎగిరి రోడ్డుపక్కన ఉన్న గుంటలో పడి మృతి చెందాడు. ఉదయం 8.15కు సూర్యనారాయణ విధులకు హాజరు కావాల్సి ఉండగా, ఫోన్ లిఫ్ట్ చేయకపోవటంతో రైల్వే అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

రేషన్ మాఫియాకు అధికారుల సహకారం

- నెల్లూరు రూరల్, కోవూరులో పెద్ద ఎత్తున అక్రమ రవాణా
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కొంత మంది అవీనీతి అధికారుల సహకారంతోనే రేషన్ మాఫియా చెలరేగిపోతోందని, దీని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల బియ్యాన్ని బొక్కేస్తున్న పందికొక్కులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జాయింట్ కలెక్టరును సైతం సివిల్ సప్లైస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని, ఈ అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోకపోతే తానే స్వయంగా అడ్డుకుంటానని, తక్షణం అక్రమార్కులపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సుభానీనగర్‌లో పట్టుబడిన లారీల్లో రేషన్ బియ్యం ఉంటే కేవలం రెండు లారీల్లోనే రేషన్ బియ్యం ఉన్నాయంటూ మిగిలిన లారీలను అధికారులు వదిలేశారని ఆరోపిం చారు. దళారీ అయిన మహేష్‌రెడ్డిపై మాత్రమే కేసు నమోదు చేశారని, సూత్రధారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే అతనిపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ మాఫియాకు సహకరిస్తున్న సివిల్ సప్లైస్ విజిలెన్స్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతోందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నా రేషన్ మాఫియా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు చెడ్డ పేరు వచ్చేలా ఎవరు వ్యవహరించినా ఊరుకునే ప్రస క్తే లేదన్నారు. ఈ మాఫియాపై లోతుగా విచార ణ జరిపించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తానెప్పుడూ ప్రజాపక్షమేనని చెప్పారు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలోని పేదల బియ్యాన్ని డాన్ స్మగ్లింగ్ చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో చెప్పాలన్నారు.

నేటి నుంచి గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ కిరణ్‌కుమార్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆదివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్‌లో జరుగుతుందని వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఇందిరాభవన్‌లో గ్రేట్ సింహపురి ఎలక్ట్రానిక్స్ ఫెస్టివల్ పేరుతో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను విడుదల చేశారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రేట్ సిం హపురి షాపింగ్ ఫెస్టివల్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు టూ వీలర్స్, ఇన్సూరెన్స్ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు తదితరాల ప్రదర్శన, అమ్మకాలు ఉం టాయని తెలిపారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించడం, తద్వారా వినియోగదారులకు లభించే వాస్తవ ప్రయోజనాలను వారికి తెలియచేయటమే ఈ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు.

1100కుపైగా ప్రాజెక్టుల ప్రారంభం

- ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మౌలిక సదుపాయాలనిధి, పశుసంవర్ధక, మత్స్యశాఖ, ఆహార ప్రాసెసింగ్ రంగంలో మొత్తం 1100 లకుపైగా ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రధానమంత్రి దేశ రైతులకు రూ.42 వేల కోట్ల విలువైన వ్యవసాయ ప్రాజెక్టులను సమర్పించే అన్నదాతల గౌరవం సమృద్ధి భారత నిర్మాణం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ పప్పుధాన్యాలు, నూనెగింజలకు సంబంధించి కొత్త ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభిస్తున్నారన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీ.లలితాశివజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొదలకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ప్రసన్నరాజేష్, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయం డీపీడీ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి, పక్కన వ్యవసాయాధికారులు

మాలకొండలో అభివృద్ధి పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ముందుగా ఆయన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించి భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రాన్ని సందర్శించి అన్నదాన కార్యక్రమ నిర్వహణ, భోజన వసతి ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. మాలకొండ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయం రూ. 13,19,816

మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి శనివారం రూ.13,19,816 ఆదాయం వచ్చింది. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అష్టోత్తర టిక్కెట్ల ద్వారా రూ.10,400, కుంకుమార్చన టిక్కెట్ల ద్వారా 22,880, వివాహ టిక్కెట్ల ద్వారా 15,000, తలనీలాల ద్వారా రూ.43,175, వాహన పూజల ద్వారా రూ3,360, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3 58,900, స్థల పురాణం ద్వారా రూ. 800, రూం అద్దెల ద్వారా రూ. 27,780, కవర్లు ద్వారా రూ.10,425, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,56,660, అన్నదానం ద్వారా రూ.5,30,172, విరాళాల ద్వారా రూ.40,264 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్ చెప్పారు.

శ్రీగంధం చెట్టు నరికివేత

ఉదయగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపాన గల గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తోటలో గుర్తుతెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్టు నరికి తీసుకెళ్లిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటలో 35 ఏళ్లుగా శ్రీగంధం చెట్లు పెంచుతున్నామని, రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఒక చెట్టు నరికి తీసుకెళ్లారని రైతు తెలిపారు. ఆ చెట్టు విలువ సుమారు రూ.7 నుంచి రూ.8 లక్షల ఉంటుందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఒకే గొడుగు కిందకు గ్రామీణ బ్యాంకులు

- రాష్ట్రంలో ఉన్న నాలుగు కలిపి ఏపీ గ్రామీణ బ్యాంకుగా రూపాంతరం
- కొనసాగుతున్న సాంకేతిక అనుసంధానం
- రేపటి వరకు సేవలు నిలిపివేత

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రాంతాల వారీగా గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఆ బ్యాంకుల పరిధిలోనే సేవలు అందేవి. తాజాగా ఈ గ్రామీణ బ్యాంకులన్నీ విలీనం అవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం నాలుగు గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ బ్యాంకులన్నింటినీ కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించింది. ఈ ప్రకటన తరువాత సాంకేతిక అనుసంధాన పనులు జరగలేదు. సోమవారం వరకు ఈ అనుసంధాన పనులు ఉంటాయి. దీంతో ఆ బ్యాంకు కార్యకాపాల్లో అంతరాయం ఏర్పడనున్నది. రాష్ట్రంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నాలుగు బ్యాంకుల డేటాను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకితీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా ఈనెల 13 వరకు అన్నీ రకాల బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచి పోనున్నాయి. శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవులు అయినా, సాధారణంగా పని చేసే ఆన్‌లైన్ సేవలు కూడా అందుబాటులో ఉండవని అధికారులు తెలిపారు. సేవల్లో అంతరాయం ఏర్పడనున్నందున ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. సాంకేతిక డేటా వంటి విలీన పనులు పూర్తయితే లావాదేవీలలో వేగం పెరగనుంది. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి.

